# వాహనాలను జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే

**కమలాపురం, ఆగస్టు 8, ప్రభాతవార్త:**



ప్రజల అవసరాల దృష్ట్యా కడప జాతీయ రహదారి పాపాగ్ని అప్రోచ్ రోడ్డు పనులు వేగంగా పూర్తి చేసి సోమవారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి వాహనాలను జెండా ప్రారంభించారు. అందుబాటులోకి తీసుకొచ్చిన అధికారులకు మరియు కాంట్రాక్టరుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కొందరు టీడీప నేతలు వంతెనపై అనవసరపు రాద్ధాం మరియు అనవసరపు మాటలు మాట్లాడుతున్నారని వారు గతంలో ఎన్నో తప్పులు చేసి మరిచి పోయి తాము ఏదో సచ్చిలుకులుగా మాట్లాడుతున్నారన్నారు. కోతకు గురైన వంతెనపై విచారణకు ఆదేశించాం తప్పు అధికారులదో, లేక కాంట్రాక్టర్‌దో తెలుసుకొని వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర వైస్‌చైర్మన్ సాదిక్, శ్రీనివాసరెడ్డి, ఆర్‌వీఎన్‌ఆర్ యువనేత ఇస్మాయిల్, సీఐ రవీంద్రనాథ్‌రెడ్డి, ఎస్సై కొండారెడ్డి, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

మంగళవారం 09 ఆగస్టు 2022


## ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పాత్రికేయుల సేవలు అమోఘం

**- జిల్లా కలెక్టర్ గిరీష పి ఎస్, జిల్లా ఎస్పి హర్షవర్ధన్‌రాజు**



అన్నమయ్య జిల్లా రాయచోటిలో వార్త నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్

వార్త IVవ పేజీలో

# గృహ నిర్మాణ పథకం లక్ష్యం ఛేధించాలి

## అధికారులకు కలెక్టర్ విజయ్ రామరాజు ఆదేశాలు

**కడప, ఆగస్టు 8, ప్రభాతవార్త:**

నవరత్నాలు కార్యక్రమంలో.. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న గృహ నిర్మాణ పథకం లక్ష్యాన్ని జిల్లాలో అధిగమించాలని కలెక్టర్ విజయ్ రామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభాభవన్‌లో కలెక్టర్ జేసీ సి.ఎం. సాయి కాంత్ వర్మ, నగర కమీషనర్ జి.ఎస్.ఎస్. ప్రవీణ్ చంద్, హౌసింగ్ పీడి కృష్ణయ్య లతో కలిసి.. జగనన్న హౌసింగ్ కాలనీల్లో గృహ నిర్మాణ పనులు, ఓటీఎస్, జగనన్న స్వచ్ఛ సంకల్పం పనుల పురోగతితో పాటు "గడప గడపకు మన ప్రభుత్వం" కార్యక్రమం నిర్వహణపై మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి అధికారులతో నేరుగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు.. ప్రజలకు సంతృప్త స్థాయిలో అందాలనే ప్రభుత్వ లక్ష్యం మేరకు అధికారులందరూ నిబద్ధతతో పని చేయాలన్నారు. గృహ నిర్మాణ పథకంలో భాగంగా చేపట్టిన హౌసింగ్ నిర్మాణ పనుల్లో స్టేజీ కన్వర్షన్ ప్రక్రియను త్వరతిగతిన పూర్తి చేయాలన్నారు. ఆ మేరకు అధికారులందరూ బాధ్యతతో పని చేయాలని గ్రామాలు, వార్డుల పరిధిలో వన్ టైం సెటిల్మెంట్ (ఓటీఎస్) ప్రక్రియ, స్టేజి కన్వర్షన్, డిజిటల్ సైనింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ఆయా మండలాలు, మున్సిపాలిటీల పరిధిలో ఉన్న లే అవుట్లలో గృహ నిర్మాణ పనుల పురోగతిపై ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. గృహనిర్మాణ పనులను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని.. ఆదేశించారు. ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఉన్నందున. ప్రతి సోమవారం హౌసింగ్ సమీక్షా సమావేశంలో అందజేసే రిపోర్డులను.. ముందస్తుగా ఈ శుక్రవారమే అందజేయాలని అధికారులకు సూచించారు. ప్రజారోగ్య భద్రత గురించి మాట్లాడుతూ...





ఎక్కడా కూడా నీరు నిల్వ లేకుండా, దోమలు చేరకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి శుక్రవారం విధిగా డ్రైడే కార్యక్రమంను నిర్వహించాలన్నారు. మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా మలేరియా, డెంగ్యూ కేసులు నమోదు అయితే.. తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే జిల్లాలోని ప్రతి గ్రామంలో పారిశుద్ధ్య పనులు క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంతో భాగంగా.. పట్టణ ప్రాంతాల్లో చేపడుతున్న ఇళ్ల నుండి చెత్త సేకరణ కార్యక్రమంపై ఎంపిడివోలు, మున్సిపల్ అధికారులు, పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సచివాలయాల సేవలు, సిబ్బంది హాజరు గురించి మాట్లాడుతూ.. బయోమెట్రిక్, సచివాలయ భవన నిర్మాణాలు, స్పందన అర్జీల పరిష్కారం వేగవంతం వంటి అంశాలపై యాక్షన్ ప్లాన్, పురోగతిపై.. సిహెచ్‌ఓలు, ఎంహెచ్ఓ లతో సమీక్షించారు. స్పందన పోర్టల్, మీ-సేవా, ఏపీ సేవా పోర్టల్ లో ప్రతిరోజు విధిగా సర్వీసు రిక్వెస్టులను పరిశీలించి సంబంధిత రిపోర్టులు, పరిష్కార నివేదికలను నమోదు చేయాలన్నారు. అంతే కాకుండా.. నాడు-నేడు పనులను ఎక్కడా కూడా నిర్మాణ పనుల్లో జాప్యం జరగకుండా.. నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఎన్.ఆర్.ఈ.జి.ఎస్. పనిదినాలను కల్పించడంలో జిల్లాకు నిర్దేశించిన రోజువారీ లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు.-ఈ కార్యక్రమంలో కడప, బద్వేలు రెవెన్యూ డివిజన్ల.. ఆర్డీవోలు ధర్మచంద్రారెడ్డి, వెంకట రమణ లతో పాటు నియోజకవర్గ, మండల ప్రత్యేకధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహాశీల్దార్లు, ఎంపిడివోలు, హౌసింగ్, డ్వామా, డిఆర్డీఏ, పీఆర్ అధికారులు, ఇంజనీర్లు తదితరులు హాజరయ్యారు.

# మదనపల్లెకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్ రాక

## సభాస్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ గీరీష్

**మదనపల్లె, ఆగస్టు 8 ప్రభాతవార్త :**

మదనపల్లెకు ఈనెల 18న ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రానున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈమేరకు సోమవారం జిల్లా కలెక్టర్ పిఎస్.గిరీష్, ఆర్డీఓ ఎంఎస్.మురళి, డిఎస్‌పి రవిమనోహరాచారి, కమీషనర్ ప్రమీలలు సభాస్థలాన్ని పరిశీలించారు. నేతన్న నేస్తం పథకం ప్రారంభోత్సవ సందర్భంగా లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేసే కార్యక్రమాన్ని మదనపల్లెలో చేపట్టనున్నట్లు తెలిపారు. బెంగుళూరు రోడ్డులోని విజయాడెయిరీ వెనుక ఉన్న మైదానాన్ని, బిటి కళాశాల మైదానాన్ని, టిప్పు సుల్తాన్ మైదానాలను కలెక్టర్ రెవెన్యూ యంత్రాంగంతో కలసి పరిశీలించారు. హెలిప్యాడ్ స్థలం, సభాస్థలాన్ని రెండింటిని పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన అధికారికంగా ఖరారు కాలేదని, సిఎం పర్యటన ఖరారు కానున్నట్లు తెలియడంతో ముందస్తుగా సభాస్థలాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. కలెక్టర్ వెంట తహశీల్దార్ సికె.శ్రీనివాసులు, సిఐ ఈదూర్‌బాషా, మున్సిపల్ డిఈ శీరీష తదితరులు పాల్గొన్నారు.



సభాస్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

# గంధం పీరుకు రాంప్రసాద్‌రెడ్డి ప్రత్యేక పూజలు

**చిన్నమండెం, ఆగస్టు 8ప్రభాతవార్త:**



మండల కేంద్రంలోని చిన్నమండెం పీర్ల మకాన్ నందు మొహ్రమ్ సందర్భంగా రాయచోటి తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ నాయకుడు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గంధం పీరుకు బాషికంతో పాటు పూల హారాలను రాంప్రసాద్‌రెడ్డి తమ అభిమానులతో కలిసి ఊరేగింపుగా తీసుకెళ్లి పీర్లకు అమర్చి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మకాన్ కమిటీ సభ్యులు రాంప్రసాద్‌రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మొహరంను ప్రజలందరూ కులమతాలకు అతీతంగా జరుపుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండిపల్లి అభిమానులతో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫిర్యాదులపై సత్వరం స్పందించి న్యాయం చేయాలి

**- స్పందనలో జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్**



**కడప క్రైం, ఆగస్టు 8, ప్రభాతవార్త:**

జిల్లాలో బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ అన్బురాజన్ స్పందన కార్యక్రమంలో బాధితులతో స్వయంగా ముఖాముఖి మాట్లాడి, వీడియో కాన్ఫరెన్సు ద్వారా వారి సమస్యలను తెలుసుకున్నారు. స్పందన ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

# అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

**దువ్వూరు, ఆగస్టు 8, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన దువ్వూరుకు చెందిన ఆరవేటి మాధవి(23) అనే వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్సై కేసీ రాజు తెలిపారు. మాధవి తండ్రి బ్రహ్మయ్య ఆచారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రుద్రవరం మండలం తంబలూరుకు చెందిన మాధవిని దువ్వూరులో నివసిస్తున్న బాలమురళీకృష్ణకు 2 సంవత్సరాల క్రితం వివాహం జరిపించారు. వివాహం అనంతరం అన్యోన్యయంగా ఉన్నారని తెలిపారు. అయితే ఈ నెల 28వ తేదీన మాధవికి ఆరోగ్యం సక్రమంగా లేదని ప్రొద్దుటూరులోని ఆసుపత్రిలో చూపించి అక్కడి నుంచి నంద్యాలలో చికిత్స చేయించి అనంతరం తిరుపతి రుయాకు తీసుకెళ్లామన్నారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. కూతురు మరణించిన విషయం తెలిసి వచ్చామని, అప్పుడప్పుడు ఆడపడుచు, అత్త, భర్త వేధించేవారని, అదనపు కట్నం కావాలని కోరేవారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో మాధవి మృతి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రొద్దుటూరు ఆసుపత్రిలో తహసీల్దారు రమాకుమారి ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించామన్నారు.

# ఆర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించండి

## కలెక్టర్ విజయ్ రామరాజు



**కడప, ఆగస్టు 8 ప్రభాతవార్త :**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక "స్పందన" ద్వారా స్వీకరించిన అర్జీదారుల సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను కలెక్టర్ విజయ్ రామరాజు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని స్పందన హాల్లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ "స్పందన" కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్ వి.విజయ్ రామరాజుతో పాటు ఇంఛార్జి డిఆర్వో, స్పెషల్ కలెక్టర్ రామమోహన్, డ్వామ, డిఆర్డీఏ పీడిలు యదుభూషన్ రెడ్డి, పెద్దిరాజు, అనుడ విసి శ్రీలక్ష్మి లు హాజరై.. ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ్ రామరాజు మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్‌ఏ, రీఓపెనింగ్.. లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు.

# పేద ప్రజల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

## ఉపముఖ్యమంత్రి అంజాద్ బాష

**కడప కార్పొరేషన్, ఆగస్టు 8, ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రజల సంక్షమం, అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఉపముఖ్యమంత్రి, రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖా మంత్రి ఎస్.బి.అంజాద్ బాషా పేర్కొన్నారు. సోమవారం నగరంలోని 15వ డివిజన్ పరిధిలోని ఎలెక్ట్రిసిటీ కాలనీ, సాగర్ కాలనిలలోని ప్రాంతాల్లో 21 వ రోజున "గడప గడపకు మన ప్రభుత్వం" కార్యక్రమం ఎస్.బి. అంజాద్ బాషా ఆధ్వర్యంలో సాగింది. ఈ సందర్భంగా.. ప్రతి కుటుంబాన్ని పలకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తోన్న సంక్షేమ పథకాలు, సేవలు పట్ల లబ్ది దారుల మనోగతాన్ని తెలుసుకుంటూ ముందుకు సాగారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారికి వివరించి, ప్రజలను ఆప్యాయంగా పలకరించి వారిని కలుసుకోవడంతో పాటు, వారు పొందుతున్న లబ్ది సమాచారంతో కూడిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి సంతకం చేసిన బుక్ లెట్‌ను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా ప్రజలకు చేరుతున్నాయని ఉపముఖ్యమంత్రి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు సంతృప్త స్థాయిలో అందడం జగన్ మోహన్ రెడ్డి పారదర్శక పాలనకు అద్దం పడుతోందన్నారు. కరోనా లాంటి ప్రపంచ విపత్కర పరిస్థితుల్లో కూడా.. ప్రజలు ఏ మాత్రం ఆర్థికంగా ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో సంక్షేమ పథకాలను నిరంతరాయంగా



అమలు చేసిన ఘనత మన ముఖ్యమంత్రికే దక్కుతుందని ప్రశంసించారు. అమ్మఒడి, వైయస్సార్ పింఛన్ కానుక, వైయస్సార్ చేయూత వైయస్సార్ ఆసరా, వైయస్సార్ ఆరోగ్యశ్రీ, వాహనమిత్ర వైయస్సార్ వసతి దీవెన, వైయస్సార్ విద్య దీవెన, పేదలందరికీ ఇల్లు వంటి సంక్షేమ పథకాలను లబ్దిదారులకు వివరిస్తూ గడపగడపకు ఆయన పర్యటన సాగింది. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఒక్కరు కూడా సంక్షేమ పథకాలను కోల్పోకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి "గడప గడపకు మన ప్రభుత్వం" కార్యక్రమాన్ని.. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రితో పాటు డిప్యూటీ కమిషనర్ రమణా రెడ్డి, 15 డివిజన్ కార్పొరేటర్ లక్ష్మీ దేవి, డివిజన్ ఇంచార్జి వీరారెడ్డి, ఇతర నగర కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ ఛైర్మన్‌లు, డైరెక్టర్స్, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 76వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతం చేయండి

## ప్రతి ఇంట మువెన్నల జండా రెపరెపలాడాలి

## కలెక్టర్ విజయరామరాజు



**కడప, ఆగస్టు 8 ప్రభాతవార్త**

76వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రణాళిక మేరకు ఏర్పాట్లు పూర్తి చేసి విజయవంతం చేయాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. ఈనెల 15న 76వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని సోమవారం స్థానిక కలెక్టరేట్ స్పందన సమావేశ హాల్ నందు వివిధ శాఖల అధి కారులతో సమావేశం నిర్వహించి వేడుకల ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 15న స్థానిక పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే వేడుకల్లో జెండా వందనానికి అవసరమైన ఏర్పాట్లను సిద్ధం చేయాలన్నారు. అలాగే వేదికను అందంగా అలంకరించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. పెరేడ్ మైదానంలో చుట్టుపక్కల పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, అలాగే కార్యక్రమానికి హాజరైన వారికి తాగునీటి సరఫరా ఏర్పాటు చేయాలని మునిసిపల్ కమీషనరును ఆదేశించారు. కార్యక్రమానికి హాజరయ్యేందుకు ప్రోటోకాల్ మేరకు ప్రజాప్రతిని ధులు, స్వాతంత్ర సమరయోధుల కుటుంబ సభ్యులు, ఇతర అతిథులను వేడుకలకు ప్రత్యేకంగా ఆహ్వానించి, సీటింగ్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలకు సంబంధించిన అంశాలపై, అభివృద్ధి సంక్షేమంపై ప్రదర్శన శకటాలు, ఎగ్జిబిషన్ స్టాళ్ళను ఏర్పాటు చేయాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. ప్రదర్శన శకటాలను, ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను పర్యవేక్షణ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉదయం పెరేడ్ మైదానంలో సాంస్కృతిక కార్యాక్రమాలను ఏర్పాటు చేయాలని డీఈఓను ఆదేశించారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని విద్యుత్ శాఖను, మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలని డిఎంహెచ్ఓ, డిసిహెచ్ లను ఆదేశించారు. కోవిడ్-19 ప్రభావం నేపథ్యంలో.. ప్రతి ఒక్కరూ సామాజిక, భౌతిక దూరం పాటించేలా సీట్ల ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని, వేడుకలలో పాల్గొనాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జేసీ సిఎం. సాయికాంత్ వర్మ, ఇంచార్జి డిఆర్వో రామ్ మోహన్, కడప, బద్వేలు ఆర్డీఓలు పి. ధర్మచంద్రారెడ్డి, వెంకట రమణ, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు రైలు కింద పడి న్యాయవాది మృతి

**కడప క్రైం, ఆగస్టు 8, ప్రభాతవార్త:**

కడప రైల్వేస్టేషన్‌లో తెలంగాణ రాష్ట్రం హైదరాబాదుకు చెందిన న్యాయవాది ప్రమాదవశాత్తు రైలు కింద పడి మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల మేరకు తెలంగాణ రాష్ట్రం హైదరాబాదు, హిమయత్‌నగర్‌లోని ఆసిస్ రెసిడెన్సీ, ప్లాంట్ నెంబరు102లో నివాసం ఉంటున్న పాపిరెడ్డిగారి శ్రీనివాసరెడ్డి (60) కడపలో బంధువుల వివాహానికి హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో కడప రైల్వేస్టేషన్‌లో రైలు ఎక్కుతు ప్రమాదవశాత్తు రైలు కింద పడి మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# రాజంపేటలో వినాయకుని గుడి ప్రహరీ కూల్చిన మున్సిపల్ అధికారులు

## నిలదీసిన స్థానికులు

## అనుమతి లేకపోవడంతోనే కూల్చినట్లు చెప్పడంపై సర్వత్ర ఆగ్రహం



ప్రభుత్వ హైస్కూల్ వద్ద నిర్మించిన వినాయకుని గుడి, ఆలయ ప్రహరీగోడ కూల్చేందుకు జెసిబి రావడంతో అక్కడికి చేరుకొన్న స్థానికులు

**రాజంపేట అర్బన్, ఆగస్టు 8 ప్రభాతవార్త**

రాజంపేట మున్సిపాలిటి పరిధిలో ఓ ఆలయ ప్రహరీ గోడను మున్సిపల్ అధికారులు కూల్చిన సంఘటన సోమవారం జరిగింది. ప్రజలు చుట్టుముట్టడంతో అధికారులు వెనుదిరిగారు. వివరాల్లోకి వెళితే రాజంపేట పట్టణం ప్రభుత్వ హైస్కూల్ వద్ద వత్తలూరు రోడ్డులో రామాలయానికి పక్కనే వినాయకుని గుడి ఉంది. ఫ్లైఓవర్‌బ్రిడ్జి కింది భాగంలో 2 రోడ్లకు మధ్యలో ఈ ఆలయాన్ని నిర్మించారు. ప్రహరీగోడ లేకపోవడంతో ఆలయ పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. దీంతో స్థానికులు అందించిన విరాళాలతో ఆలయ ప్రహరి నిర్మించేందుకు దాతలు పూనుకున్నారు. ఈ మేరకు వారం రోజుల క్రితం పనులు ప్రారంభించారు. నెలాఖరున వినాయకచవితి ఉండడంతో అప్పటికి ప్రహరిని పూర్తి చేయాలనే ఉద్దేశ్యంతో పనులు చేపట్టారు. గత 5 రోజులుగా ప్రతిరోజు వర్షం పడుతుండడంతో పనులకు అంతరాయం ఏర్పడింది. పునాది నుంచి 3 అడుగుల మేర పిల్లర్లతో ప్రహరీని నిర్మించారు. ఒక్కసారిగా సోమవారం సాయంత్రం మున్సిపల్ అధికారులు, పోలీసులు ఆలయం వద్దకు చేరుకొన్నారు. అనుమతి లేకుండా ఎలా నిర్మిస్తారని ఆలయ నిర్వాహకులను ప్రశ్నించారు. స్థానికులు సర్దిచెప్పారు. అనుమతి లేకుండా నిర్మయిస్తే ఒప్పుకోమని టౌను ప్లానింగ్ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణమ్మ చెప్పారు. ఆలయ ప్రహరీగోడ నిర్మాణానికి అనుమతులు ఏమిటని స్థానికులు ప్రశ్నించారు. కమిషనర్ ఆదేశాల మేరకు తాము వచ్చామని చెప్పి వత్తలూరు రోడ్డు వైపు నిర్మించిన ప్రహరీగోడను జెసిబితో కొంతమేరకు తొలగించారు. దీంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విశ్వహిందూ పరిషత్, బిజెపి, వైకాపా, తెలుగుదేశం పార్టీల నేతలతో పాటు చుట్టుపక్కల ప్రజలు అక్కడికి చేరుకొన్నారు. వినాయకుని గుడి ప్రహరీగోడ పనులు అడ్డుకోవడం భక్తుల మనోభావాలు దెబ్బతీయడమేనని మండిపడ్డారు. ప్రహరీగోడ పనులు అడ్డుకోవడం ప్రధానంగా జెసిబి పెట్టి పూడ్చాలనుకోవడం దుర్మార్గమని స్థానికులు వ్యాఖ్యానించారు. మున్సిపల్ అధికారుల తీరుపట్ల సర్వత్రా విమర్శలు వినిపించాయి. మున్సిపాలిటి అనుమతి తరవాతనే పనులు చేపట్టాలని టౌను ప్లానింగ్ సూర్‌వైజర్ నిర్వాహకులకు స్పష్టం చేశారు.

# స్పందన ఆర్జీలను అధికారులు త్వరితగతిన పరిష్కరించాలి

## డిఆర్ఓ సత్యనారాయణ

**రాయచోటి, ఆగస్టు 8 ప్రభాతవార్త :**

స్పందన అర్జీలను నిర్ణీత గడువులోగా త్వరితగతిన పరిష్కరించాలని డి.ఆర్.ఓ సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని స్పందన హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ సత్యనారాయణ, ఆర్.డి.ఒ రంగస్వామిలు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా డి.ఆర్.ఓ మాట్లాడుతూ... అధికారులు స్పందన అర్జీలను పరిశీలించిన తర్వాత అర్జీదారులకు అర్థమయ్యే విధంగా పరిష్కార నివేదిక పంపాలన్నారు. పరిష్కరించిన అర్జీలు రీ ఓపెన్ కాకుండా సమస్యలను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలన్నారు. అర్జీలు బియాండ్ ఎస్ఎల్‌ఏ లోకి వెళ్లకుండా నిర్దేశించిన గడువులోపల క్లియర్ చేయాలన్నారు.ప్రభుత్వం ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలనే ఉద్దేశంతో స్పందన కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని...



అధికారులందరూ ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని స్పందన కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ చూపి బాధితులకు న్యాయం చేయాలన్నారు. సోమవారం స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను శనివారం లోపల క్లియర్ అయ్యేటట్లు చూడాలన్నారు. దీంతో స్పందన అర్జీలు బియాండ్ ఎస్ ఎల్ ఎ లోకి వెళ్లకుండా ఉండే అవకాశం ఉంటుందన్నారు.

# కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది : రమేష్ రెడ్డి

**లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 8, ప్రభాతవార్త:**

తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని రాయచోటి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మద్దిరేవుల పంచాయతీలోని రెడ్డివారిపల్లి, ఈడిగపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అబద్దాల పరిపాలనకు తొందర్లో నూకలు చెల్లాయని తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందని ప్రతి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఎ ఎన్టీరామారావు వృద్దులకు వికలాంగులు, వితంతువులుకు పెన్షన్ తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు గంగయ్య, వెంకటరామరాజు తదితరులు పాల్గొన్నారు.



## మైదుకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భవతి మృతి

### డాక్టర్ నిర్లక్ష్యమంటూ బంధువుల ఆందోళన



మైదుకూరు, ఆగస్టు 8, ప్రభాతవార్త:

మైదుకూరులోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో ఓ గర్భవతి ప్రసవం కోసం వచ్చి రక్తస్రావం కావడంతో మృతి చెందింది. అయితే డాక్టర్ నిర్లక్ష్యంతో వైద్యం వికటించడం వల్లే మృతి చెందిందని ఆరోపిస్తూ మృతిరాలి బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళన చేశారు. ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మున్సిపాల్టి పరిధిలోని శ్రీనగరం గ్రామానికి చెందిన కందుకూరి జిలేఖ (25) అనే మహిళ ఆదివారం రాత్రి ప్రసవ నొప్పులతో మైదుకూరులోని సామాజిక ఆసుపత్రికి వచ్చింది. సోమవారం తెల్లవారు జామున ఆమె మగ శిశువుకు జన్మనిచ్చింది. అనంతరం అధిక రక్తస్రావం కావడంతో ఆసుపత్రి వైద్యుడు నరసింహ, సిబ్బంది ఆమెకు వైద్యం చేశారు. అయినా రక్తస్రావం ఆగకపోవడంతో ఎక్కడైనా తీసుకెళ్ళాలని కుటుంబ సభ్యులకు సూచించారు. వారు అంబులెన్సులో కడప రిమ్స్‌కు తరలిస్తుండగా జిలేఖ మృతి చెందింది. మృతదేహంతో ఆసుపత్రి వద్దకు చేరుకున్న జిలేఖ కుటుంబ సభ్యులు, బంధువులు వైద్యుని నిర్లక్ష్యం వల్లె జిలేఖ మృతిచెందిందని ఆరోపిస్తూ ఆందోళన చేశారు. ఆసుపత్రిపై రాళ్ళు రువ్వారు. సమాచారం అందుకున్న అర్బన్ సి.ఐ. చలపతి, సిబ్బందితో ఆసుపత్రి వద్దకు చేరుకొని జిలేఖ బంధువులను అదుపుచేశారు. ఖాజీపేట మండలం చెముళ్ళపల్లెకు చెందిన జిలేఖకు మైదుకూరు పట్టణంలో శ్రీనగరం గ్రామానికి చెందిన ఖాదర్ బాషాతో 4 సంవత్సరాల క్రింతట వివాహమైంది. వీరికి రెండేళ్ళ కుమారుడు షంషీర్ ఉన్నాడు. ఇప్పుడు రెండవ కాన్పుకోసం ఆమె ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి మృతి చెందింది. సంఘటనపై బాధితుల పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా గర్భవతి మృతిపై వైద్యశాఖ జిల్లా అధికారులు శాఖాపరమైన విచారణ చేపట్టారు.

# సామాజిక సేవామూర్తి కే.వీ. రమణారెడ్డి

### ప్రథమ వర్ధంతి సభలో ముఖ్య అతిధులుగా పాల్గోన్న వ్యక్తులు





ప్రొద్దుటూరు, ఆగస్టు 8, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు పట్టణంలో విద్యారంగంలో విశిష్ట సేవ లందించే దిశగా గోపిక్రష్ణ విద్యాలయాలను స్థాపించడమే కాకుండా సామాజిక సేవలో అందరికీ స్ఫూర్తిగా నిలిచిన కె.వి.రమణారెడ్డిని సమాజం మరువలేదని ముఖ్య అతిథులుగా పాల్గొన్న వక్తలు కొనియాడారు సోమవారం స్థానిక గోపిక్రష్ణ విద్యాసంస్థల ఆవరణలో ఆయన కుమారులు ప్రదీప్ రెడ్డి సందీప్ రెడ్డి లు తండ్రి ప్రథమ వర్ధంతి సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా టిడిపి జిల్లా అధ్యక్షులు మల్లెల లింగారెడ్డి కొత్తపల్లి సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి బీజేవైఎం రాష్ట్ర నాయకులు శిశు భూషణ్ రెడ్డి బిజెపి రాయలసీమ అధ్యక్షులు సివి జయలక్ష్మి బిజెపి నాయకులు బాల చంద్రారెడ్డి ప్రైవేటు విద్యాసంస్థల అసోసియేషన్ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి సాధన విద్యా సంస్థల చైర్మన్ బుక్కసముద్రం వెంకటేశ్వర్ రెడ్డి ప్రముఖ వైద్యులు డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డిలు హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవీ రమణారెడ్డి తో కలిసి నడిచిన పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు విద్యా సంస్థల ద్వారా ఎంతో మంది పేద విద్యార్థులకు ఉచిత విద్య సేవను అందించారని కొనియాడారు అంతేకాకుండా సమాజ సేవలో ముందుండి సేవాస్ఫూర్తిగా నిలిచారన్నారు కరోనా సమయంలో కొన్ని వందల మందికి ప్రతిరోజు భోజన సదుపాయం ఏర్పాటు చేశారన్నారు. సమాజానికి అనుకొని ఆపద వస్తే దాతలందరినీ ఏకం చేసి వారికి కావలసిన మౌలిక సదుపాయాలు అందించడంలో కృషి చేశారన్నారు. పుట్టినప్పటి నుండి ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలకులోబడి బిజెపిలో ఉన్నత స్థానాలను అధిరోహించిన వ్యక్తిగా అభివర్ణించారు ఆయనతో పార్టీలో కలిసి నడిచిన వారంతా ఆ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు అనంతరం ప్రథమ వర్ధంతి సందర్భంగా రక్తదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. గోపిక్రష్ణ విద్యాసంస్థల చైర్మన్ ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ తన తండ్రి ఆశయాలను సామాజిక సేవను కొనసాగిస్తామన్నారు. ఈ వర్ధంతిని నాలుగు రోజులుగా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు మొదటి రోజు రక్తదాన శిబిరం రెండో రోజు పేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ మూడవరోజు పేద విద్యార్థులకు కిట్ లు తదితర కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు గోపిక్రష్ణ పూర్వపు విద్యార్థులు విద్యార్థులు బిజెపి నాయకులు నరేంద్ర గురు రవి పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ముస్లింల అభివృద్ధి పథకాలకు వైసీపీ ప్రభుత్వం తూట్లు



కడప వైద్య విభాగం, ఆగస్టు 8, ప్రభాతవార్త:

ముస్లింల అభివృద్ధి పథకాలకు వైసీపీ ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని ముస్లింల ఐక్య వేదిక అడహక్ కమిటీ గౌరవాధ్యక్షులు సలావుద్దీన్ పేర్కొన్నారు. విజయవాడ రాయల్ ఇన్ ఫంక్షన్ హాలులో ముస్లిం ఐక్యవేదిక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. 7 జిల్లాల నుంచి ప్రముఖులు విచ్చేయడం జరిగింది. విజయవాడ, గుంటూరు, తెనాలి, అనంతపురం, కర్నూలు, కడప జిల్లాల నుంచి ప్రముఖులు పాల్గొన్నారు. కడప నుంచి విచ్చేసిన సయ్యద్ సలావుద్దీన్ మాట్లాడుతూ ఐకమత్యంగా ముందడుగు వేయాలన్నారు. అలాగే ఐక్యవేదిక ముస్లిం సోదరులకు 2024 సంవత్సరంలో జరిగే ఎన్నికలకు ఒక ఆయుధం లాంటిదని తెలిపారు. ముస్లింలు ప్రతి ఒక్కరూ ఐక్యవేదికలో భాగస్వామి కావాలని తెలిపారు. రాష్ట్రంలో ముస్లిం సోదరులకు గత ప్రభుత్వంలో ఇచ్చిన పథకాలు ఈ ప్రభుత్వంలో అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా దుల్హన్ పథకం విదేశీ విద్య మరియు మైనార్టీ ఫైనాన్స్ లోన్లు ముస్లింలకు అందడం లేదని మండిపడ్డారు. ఈ విషయంపై మనమంతా ఒక్కటై ప్రభుత్వాన్ని నిలదీయాలని తెలిపారు.

## ప్రయాణీకుల శ్రేయస్సే ఆర్టీసి లక్ష్యం

### రాష్ట్ర వ్యాప్తంగా 339 హైర్ బస్సులు ప్రారంభం

### ఏపిఎస్ఆర్టీసి చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జున రెడ్డి, ఎమ్మెల్యే రాచమల్లు



ప్రొద్దుటూరు, ఆగస్టు 8, ప్రభాతవార్త:

ప్రయాణికుల శ్రేయస్సు ఆర్టిసి లక్ష్యంగా రాష్ట్రంలోని డిపోలకు 339 ఐదు బస్సులు ప్రారంభిస్తున్నట్లు ఏపిఎస్ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు సోమవారం దానికి ఆర్టీసీ డిపోలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డితో కలిసి ప్రొద్దుటూరు జమ్మలమడుగు మైదుకూరు, ఆళ్లగడ్డ డిపోలకు చెందిన హైర్ బస్సులను ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల క్షేమం కోరిరాష్ట్ర వ్యాప్తంగా డిపోలకు 339 హైర్ బస్సులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ ఆర్థిక పరిస్థితి దృష్టిలో ఉంచుకుని హైర్ బస్సులకు అనుమతి నిచ్చామన్నారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో మరో 1000 కొత్త బస్సులు మంజూరు కోసం ప్రభుత్వం అనుమతి కోరినట్లు తెలిపారు.ప్రయాణీకుల సౌకర్యార్థం కోసం మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఆర్టీసీ కార్గో సేవలు మరింత విస్తృతం చేస్తామన్నారు. కార్మిక సోదరుల పట్ల చిత్తశుద్ధి కలిగిన ప్రభుత్వం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈడి గోపీనాథ్ రెడ్డి, ఆర్ ఎం గోపాల్ రెడ్డి పొద్దుటూరు డి ఎం మధు శేఖర్ రెడ్డి, వైసీపీ రాష్ట్ర నాయకులు పోరెడ్డి నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామాపురం పుణ్యక్షేత్రంలో భక్తిశ్రద్ధలతో ఉత్తర ద్వార దర్శనం..



కమలాపురం, ఆగస్టు 8, ప్రభాతవార్త:

హరిహరాదులకు నిత్య కళ్యాణం జరిగే కమలాపురం మండలం శ్రీరామాపురం పుణ్యక్షేత్రంలోని శ్రీమహాలక్ష్మీ మోక్ష నారాయణ స్వామి, శ్రీవల్లి దేవసేన సుబ్రమణ్యస్వామి దేవతా మూర్తులు వెలసిన దేవాలయంలో సోమవారం శ్రావణ మాసం శుక్లపక్ష ఏకాదశి నాడు శ్రీమహాలక్ష్మీ మోక్ష నారాయణ స్వామి ఉత్తర ద్వారం దర్శనమిచ్చారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి విచ్చేశారు. ఆలయ ప్రధాన సేవకులు కాశీభట్ల సత్య సాయినాథ్‌శర్మ ఆధ్వర్యంలో భక్తులకు భోజన వసతి సదుపాయాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం మాఢవీధుల్లో గరుడ వాహనంపై మహాలక్ష్మీ, మోక్ష నారాయణ స్వామి వారిని ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకులు జగదీష్‌శర్మ నిర్వహణలో పూజా సేవలు నిర్వహించారు.

## ఏపీ ఐసెట్ ఫలితాలు విడుదల

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 8, ప్రభాతవార్త:

ఏపీ ఉన్నత విద్యా మండలి నిర్వహించిన ఏపీ ఐసెట్-2022 పరీక్ష ఫలితాలు సోమవారం విడుదల చేశారు. గతంలో అధికారులు తెలిపినట్లుగానే ఫలితాలను విడుదల చేశారు. ఏపీ ఉన్నత విద్యా మండలి ఐసెట్ పరీక్షలను రెండు సెషన్స్‌లో నిర్వహించారు. రాష్ట్రంలోని 24 జిల్లాలతో పాటు హైదరాబాదులో కలిపి మొత్తం 107 పరీక్ష కేంద్రాల్లో ఐసెట్-202 నిర్వహించారు. ఈ ఫలితాల్లో మొత్తం 87.83% మంది అర్హత సాధించారు. ఏపీ ఐసెట్-22 పరీక్షకు మొత్తం 42,496 మంది హాజరు కాగా 37,326 మంది అర్హత సాధించారు. ఫలితాల్లో అత్యధికంగా బాలురు 87.93% పాస్ అయ్యారు. ఇక అమ్మాయిలు 87.68% ఉత్తీర్ణత సాధించారు. తిరుపతికి చెందిన రెడ్డప్ప గారి ఖాతేం 180 మార్కులతో మొదటి ర్యాంకును సాధించారు. రెండో స్థానంలో గుంటూరుకు చెందిన దంటాలా పూజిత వర్ధన్ నిలిచారు.

## ఆజాదికా అమృత్ మహోత్సవాల్లో భాగంగా వ్యాసరచన పోటీలు..

కడప లీగల్, ఆగస్టు 8, ప్రభాతవార్త:

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూఢిల్లీ మరియు ఏపీ న్యాయ సేవాధికార సంస్థ అమరావతి సూచనల మేరకు ఎస్.కవిత సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జీ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారు గాంధీనగర్ హైస్కూలు కడప నందు ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల, ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ఉమెన్స్ డిగ్రీ కళాశాల నందు వ్యాసరచన పోటీలను నిర్వహించడం జరిగింది. ఆగస్టు 13వ తేదీ నుంచి 15 వరకు ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగురవేయాలని విద్యార్థిని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సుబ్బలక్ష్మమ్మ కళాశాల ప్రిన్సిపల్, ఎస్‌కేఆర్ అండ్ ఎస్కె ఆర్ డిగ్రీ కళాశాల, రమేష్, వైస్ ప్రిన్సిపల్ ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల, నారాయణ మండల విద్యాశాఖాధికారి, సత్య సుజాతమ్మ, గాంధీనగర్ హైస్కూలు హెడ్మాస్టర్, లెక్చరర్స్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల గురించి మాట్లాడితే జైలుకు పంపిస్తామంటారా..!

### - ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి వ్యాఖ్యలపై సాయినాథ్‌శర్మ ఆగ్రహం..



కమలాపురం, ఆగస్టు 8, ప్రభాతవార్త:

ప్రజా సమస్యల గురించి మాట్లాడితే జైలుకు పంపిస్తామని కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పరోక్షంగా బెదిరించే బెదిరింపులకు ఎవరూ ఇక్కడ భయపడేవారు లేరని తెదేపా రాష్ట్ర కార్యదర్శి కాశీభట్ల సత్య సాయినాథ్‌వర్మ అన్నారు. కమలాపురంలో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ కడప - తాడిపత్రి ప్రధాన రహదారిలో పాపాఘ్ని నదిపై ఆరు నెలల క్రితం రూ.6కోట్ల వ్యయంతో నిర్మించిన అప్రోచ్ రోడ్డు చిన్నపాటి నీటి ప్రవాహానికి కొట్టుకుపోవడంపై విచారణ చేపట్టాలని తాము కోరడంలో ఉన్న తప్పేంటో ఎమ్మెల్యే తెలపాలన్నారు. అప్రోచ్ రోడ్డు నిర్మాణంలో జరిపి ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణ పనులు సక్రమంగా నాణ్యతగా చేయాలని కోరడంలో ఎమ్మెల్యేకు తప్పుగా కనిపించినట్లు ఉందన్నారు. అప్రోచ్ రోడ్డు నిర్మాణంలో ఎమ్మెల్యే తగిన శ్రద్ధ వహించి త్వరితగతిన రాకపోకల పునరుద్ధరణకు కృషి చేయడం అభినందనీయమనప్పటికీ నిర్మాణ పనుల్లో అవినీతి నిర్మూలించాలని తాము కోరడం ఆయనకు సహించనట్లుగా ఉందన్నారు. తాము అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనుల విచారణ కోరితే విచారణ కోరిన నాపై జిల్లా కలెక్టర్‌తో రెవెన్యూ అధికారులతో విచారణ చేయించి జైలుకు పంపించి కడ్డీలు లెక్క బెట్టిస్తానని ఎమ్మెల్యే బెదిరింపు ధోరణితో మాట్లాడితే ఆయన బెదిరింపులకు తాము భయపడే వాళ్లం కాదన్నారు. సాయినాథ్ శర్మతో పాటు తెదేపా నాయకులు లేటపల్లె, సుబ్బారెడ్డి, ఇటుకలపాటి జనార్ధన్, పాణ్యం సుబ్బరాయుడు, నామాలరాజ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో దళితుల హక్కులు కాలరాస్తున్నారు..

### - పీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర చైర్మన్ కొరివి వినయ్‌కుమార్



కడప వైద్య విభాగం, ఆగస్టు 8, ప్రభాతవార్త:

ఏపీలో వైసీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల హక్కులను బహిరంగంగా కాలరాస్తోందని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం రాష్ట్ర చైర్మన్ కొరివి వినయ్‌కుమార్ ఆరోపించారు. రాయలసీమ ప్రాంతానికి చెందిన అనంతపురం, సత్యసాయి, కర్నూలు, నంద్యాల, వైఎస్ఆర్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం నాయకులతో సోమవారం తిరుపతిలోని యూత్ హాస్టల్‌లో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొరివి వినయ్‌కుమార్ మాట్లాడుతూ తమది సంక్షేమ ప్రభుత్వమని చెప్పుకుంటున్న జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పేరుతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వాతలు, కోతలు పెడుతున్నారని రాజ్యాంగం కల్పించిన హక్కులను కూడా వారి దయాదాక్షిణ్యాలపైన ఆధారపడేలా చేసి భిక్షగా మార్చేశారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ విభాగం జాతీయ అధ్యక్షులు మురళీమోహన్, ఎస్సీ విభాగం రాష్ట్ర కోచైర్మన్లు శంకర్, ప్రభాకర్, ప్రసాద్, విజయభాస్కర్, వర్ల శ్రీనివాసులు, గంగాధర్ పాల్గొన్నారు.

## వర్షాకాల పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి..



జమ్మలమడుగు, ఆగస్టు 8, ప్రభాతవార్త:

వర్షాకాల పార్లమెంటు సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఆగస్టు 8, 9 తేదీల్లో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య నాయకత్వంలో ధర్నాకు మద్దతుగా జమ్మలమడుగు పాత బస్టాండు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుమలయ్య మాదిగ ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లి జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయంలో వవినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఓబులేసు మైలవరం మండలం అధ్యక్షుడు కుమారు కర్ణ రాష్ట్ర కార్యదర్శి, మాజీ అదే విధంగా ఆకు తోటపల్లి పుల్లయ్య, జిల్లా ప్రచార కార్యదర్శి సూరి, పాములేటి పెద్దకోమల గ్రామం నుంచి నక్కోనిపల్లె గ్రామం నుంచి దొమ్మర నంద్యాల మరియు కొండాపురం మండలం నుంచి తదితర గ్రామాలు అదే విధంగా ముద్దనూరు మండలం నుంచి ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బాధ్యత బీజేపీదే..!

సామాజిక పరివర్తకులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈ వర్షాకాల పార్లమెంటు సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం జమ్మలమడుగు తహసీల్దారు కార్యాలయం ఆవరణలో ఎమ్మార్పీఎస్ జిల్లా కోకన్వీనర్ రామిగాళ్ల శ్రీనివాసులు మాదిగ ఆధ్వర్యంలో 19వ రోజు జరుగుతున్న ఎమ్మార్పీఎస్ నిరసన దీక్షలను ఎంఈఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు కె.బాల ఓబయ్య పూలమాలలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ బాధ్యత బీజేపీదే అన్నారు. ఈ కార్యక్రమంలో మహజన సోషలిస్టు పార్టీ నాయకులు సుబ్బిగాళ్ల నరసింహులు మాదిగ, మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు బొంతల నాగరాజు మాదిగ, అంతయ్య, నాగేంద్ర, మారెన్న, చిన్న గంగన్న, రవికుమార్, రవిశంకర్, వెంకటేష్, చిన్నప్ప, నారాయణ, రాజు పాల్గొన్నారు.

## యువత దేశభక్తిని పెంపొందించుకోవాలి



కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 8, ప్రభాతవార్త:

నేటి యువత దేశభక్తి కలిగి తమ వంతు బాధ్యతగా దేశాభివృద్ధిలో పాలుపంచుకోవాలని ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపల్ డా.జి. రవీంద్రన్ పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా ఉద్యమ దినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ యువత తమ వంతుగా ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొని దేశభక్తిని అలవర్చుకోవాలని క్విట్ ఇండియా ఉద్యమంలో ఆనాడు యువకులు, విద్యార్థులు, ఉద్యోగులు ఉద్యమంలో పాల్గొని వారు చేసిన త్యాగాలను వివరించారు. చరిత్ర ఘట్టాలను విద్యార్థులకు వివరించారు. యువత చెడు వ్యసనాలకు లోను కాకుండా మంచి మార్గంలో పయనించాలన్నారు. చరిత్ర అధ్యాపకురాలు ఎన్.శివపార్వతి మాట్లాడుతూ ఇలాంటి వీర కార్యక్రమాల్లో పాల్గొంటూ దేశభక్తిని పెంపొందించుకొని, మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చెన్నకేశవరెడ్డి, శివరాం, వెంకటేశ్వర్లు, కళ్యాణ్ చక్రవర్తి, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

### ప్రతి విద్యార్థి దేశభక్తి కలిగి ఉండాలి



ప్రతి విద్యార్థి జాతీయ సమైక్యతా భావాన్ని పాఠశాల స్థాయి నుంచే అలవర్చుకోవాలని స్టెప్ సీఈవో డా.వల్లూరి బ్రహ్మం విద్యార్థులను ఉద్దేశించి సూచించారు. ఆజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం కడప నగరంలోని నగరపాలక ఉన్నత పాఠశాల మెయిన్ కాంప్లెక్స్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ప్రాథమిక పాఠశాలలకు మహోత్సవ కార్యక్రమంలో భాగంగా పెయింటింగ్ పోటీలు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పి.నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి శ్రీనివాసులురెడ్డి, సీఆర్‌పీ కృష్ణ, చీఫ్ కోచ్ అమృతరాజు, స్టెప్ మేనేజర్ సుబ్బరాయుడు, ఎడ్యుకేషన్ సెక్రటరీ, ప్రవళిక, మహిళా పోలీసు శాంతి, డ్రాయింగ్ టీచర్లు గురుబాబు, ఐజయ్య, వెంకట సుబ్బయ్య, డ్వాక్రా ఆర్పీలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## శివోహం సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ



ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 8, ప్రభాతవార్త:

స్థానిక అగస్తేశ్వర స్వామి దేవస్థానం ఆవరణంలో శివోహం అన్న ప్రసాద సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం మధ్యాహ్నం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోరెడ్డి నరసింహారెడ్డి సహకారంతో వారి సతీమణి కీర్తిశేషురాలు పోరెడ్డి సుజాత జ్ఞాపకార్థం పోరెడ్డి నరసింహారెడ్డి మరియు కుటుంబ సభ్యులు శివాలయంలో ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో 600 మంది అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో శివోహం కమిటీ అధ్యక్షులు శెట్టిపల్లె రాంప్రసాద్ రెడ్డి, బొల్లవరం వెంకటేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ గోన ప్రభాకర్ రెడ్డి, వైసీపీ నాయకులు కాకర్ల నాగ శేషారెడ్డి, పాణ్యం బాల శౌరి రెడ్డి, శివోహం కమిటీ ఉపాధ్యక్షులు ఎంవి నారాయణ, మురికిపాటి సూర్యనారాయణ రెడ్డి కార్యదర్శులు విజయకుమార్, గజ్జల వెంకటేశ్వర రెడ్డి సభ్యులు పి ఆంజనేయులు, లింగారెడ్డి, అశ్వత్ రెడ్డి, ప్రసాద్ అట్లా నరసింహారెడ్డి, హుస్సేన్ పీరా ఆలయ సిబ్బంది ,భక్తులు, వేద పాఠశాల విద్యార్థులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను ఆప్కాస్ సిబ్బందికి వర్తింపజేయాలి



కడప వైద్య విభాగం, ఆగస్టు 8, ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వ విభాగాల్లో పనిచేసే ఆప్కాస్ సిబ్బందికి ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని సోమవారం జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ ఉద్యోగుల మీద సవతి తల్లి ప్రేమను చూపిస్తోందన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఆప్కాసులకు మార్చి వారి జీవితాలను తలరాతలను మారుస్తానని చెప్పిన సీఎం నేడు ఆప్కాస్ ఉద్యోగులు దిన దిన గండంగా బతుకుతున్నారన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఎలాంటి సంక్షేమ పథకాలు వర్తింపు కావడం లేదు. ఎందుచేత అని అక్కడున్న అధికారులను నిలదీయగా మీరు ప్రభుత్వ ఉద్యోగులుగా ఆన్‌లైన్‌లో చూపిస్తోందనడం అన్యాయమన్నారు. చాలా మంది వికలాంగులు, వితంతులు పింఛన్లు వచ్చేవని ఇప్పుడు అన్నీ కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య, మున్సిపల్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వవిజయభాస్కర్, కోశాధికారి గోపి, నగర ప్రధాన కార్యదర్శి వై.ఎం.కేశవులు, అధ్యక్షులు రవి, జిల్లా కమిటీ సభ్యులు ఆనంద్, సీఐటీయూ నాయకులు డీఎం ఓబులేసు, చంద్రారెడ్డి, ఆప్కాస్ కార్మికులు పాల్గొన్నారు.

## అమ్మవారిని దర్శించుకోన్న ఎమ్మెల్సీ



చింతకొమ్మదిన్నె ఆగస్టు: 8, ప్రభాతవార్త :

మండల పరిదిలోని కోత్తపేట సమీపంలో వెలసిన శ్రీగంగమ్మ తల్లిని ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ సోమవారం దర్శించుకొన్నారు.అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అలయ అర్చకుల చేత అస్వీర్వాదం పోందారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గంగమ్మ తల్లి భక్తుల కోరిన కోర్కెలు తీర్చే అమ్మ వారుగా పేరొందినారని అన్నారు. జిల్లా నలు మూలలనుండి అమ్మవారిని దర్శించుకోటారని తెలిపారు. ఈకార్యక్రమంలో జడ్పి వైస్ చేర్మెన్ బాలయ్య యాదవ్, బంగారు నగయ్య, శివయాదవ్, వెంకట సాయి, రమణా, శ్రీదర్, తదతరులు పాల్గోన్నారు.

## మృతదేహానికి అంత్యక్రియలు



ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 8, ప్రభాతవార్త:

ప్రొద్దుటూరు లోని అమృత్ నగర్ 18 వ స్ట్రీట్ నందు నివసిస్తున్న పాలగిరి నారాయణ రాజు అనే వ్యక్తి చనిపోగా అతనికి ఒకటే కూతురు కావడంతో అంత్రక్రియలు నిర్వహించడానికి ఎవరు లేకపో వడంతో అక్కడ ఉన్న ప్రజలు మేఐహెల్ప్ యు ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్ రావుని సంప్రదించగా వారు వెంటనే స్పందించి ప్రొద్దుటూరులోని హిందూ స్మశాన వాటికలో సంప్రదాయ ప్రకారం అంతక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ లక్ష్మణ్ రావు,సి-ఈఓ మల్లికార్జున,ప్రొద్దుటూరు ప్రెసిడెంట్ శివసాయినాథ్, మరియు సభ్యులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి హర్‌ఘర్ తిరంగాలో భాగస్వామ్యం అవ్వాలి : కేఓఆర్ఎమ్ సెక్రటరీ లిఖితా రెడ్డి



కడప, ఆగస్టు 8 ప్రభాతవార్త :

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరములు అయిన సదర్భం గా భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆజాదీకా అమృత్ మహోత్సవ భాగంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ప్రతి విద్యార్థి పాల్గొనాలని కందుల ఓబుల్ రెడ్డి మెమోరియల్ ఇంజనీరింగ్ కళాశాల సెక్రెటరీ లిఖిత రెడ్డి పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య స్ఫూర్తిని నింపుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె ప్రతి విద్యార్థినీ కోరారు. ఈ నెల 11 నుండి 17 వ తేదీ వరకు ప్రతి విద్యార్థి తమ ఇంటి పైన త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేయాలని కళాశాల ప్రిన్సిపల్ డా. గిరిధర్ ఆకుల తెలిపారు. అలాగే తమ ఇంటి చుట్టు ప్రక్కల ఉన్న వారు కూడా తమ ఇంటి మీద త్రివర్ణ పతాకాన్ని ఎగుర వేసేటట్లు చూడాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులుతో పాటు శ్రావణి, విశ్వనాథ రెడ్డి, పి.డి,గంగారాంలు పాల్గొన్నారు.

## భారత స్వాతంత్ర్యంలో కాంగ్రెస్ ముఖ్య భూమిక : నీలి శ్రీనివాసరావు



కడప వైద్య విభాగం, ఆగస్టు 8, ప్రభాతవార్త:

భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకు రావడంలో భారత జాతీయ కాంగ్రెస్ కీలక భూమిక పోషించిందని కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 75 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా వజ్రోత్సవాలను కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా నిర్వహిస్తోందన్నారు. వజ్రోత్సవాల సందర్భంగా అన్ని నియోజకవర్గాలలో పాదయాత్రలకు శ్రీకారం చుట్టిందన్నారు. భారత మొదటి ప్రధానిగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వ్యవసాయ రంగాన్ని సాగునీటి రంగాన్ని, పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి పరిచి, శాస్త్ర సాంకేతిక రంగాన్ని విద్యా, వైద్య రంగాన్ని మౌలిక వసతులు, రోడ్డు, రైలు మార్గాలు, విమానయానం, పోర్టుల అభివృద్ధి లాంటి అనేక రంగాలలో దేశాన్ని ముందుకు తీసుకెళ్తే అనంతరం ఇందిరాగాంధీ ప్రధానిగా దేశంలో ప్రతి ఒక్కరికి గూడు, గుడ్డ, తిండి, ఇళ్లు ఉండాలని దానికోసం పని చేశారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ రీసెర్చ్ విభాగం చైర్మన్ విజయ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుమలేష్ పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి ఆధ్వర్యంలో ఆసుపత్రిలో పండ్లుబ్రెడ్లు పంపిణీ



రాయచోటి, ఆగస్టు 8, ప్రభాతవార్త:

రాయచోటి పట్టణం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా 50 మంది బాలింతలకు పండ్లు బ్రెడ్లు సబ్ ఇన్స్పెక్టర్లు నరసింహారెడ్డి రఫీలు పంపిణీ చేశారు లయన్స్ క్లబ్ అధ్య క్షుడు షేక్ మహమ్మద్ నిరంతరం నిస్వార్థ ప్రజా సేవ చేయడం అభినందనీయ మని ఎస్సైలు కొనియాడారు . అనంతరం డాక్టర్ మహేశ్వర రాజు మాట్లాడుతూ తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని పుట్టిన పురిటి పిల్లలకు తల్లిపాలు తాపడం వల్ల శిశువు ఆరోగ్యంగా ఉంటారన్నారు. రాబోవు రోజులలో లయన్స్ క్లబ్ ఆఫ్ రాయ చోటి టౌన్ తరుపున ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ బేపారి మహమ్మద్ ఖాన్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ వారు మన ఆసుపత్రికి పలు రకాలుగా సేవలు చేస్తున్నారని లయన్స్ క్లబ్ సేవలు ఎనలేనివి ఆపదలో మేమున్నామంటూ ఆపన్న హస్తం ఇస్తున్నారని . మా ఆసుపత్రి కమిటీ తరపున లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ అధ్యక్షుల వారికి వారి టీముకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎస్సైలు నరసింహారెడ్డి, మహమ్మద్ రఫీలు మాట్లాడుతూ ఎక్కడ ఎవరికి ఏ అవసరం వచ్చినా మేమున్నామంటూ ముందుకు వచ్చి ప్రతి ఒక్కరికి తమ వంతుగా సహాయ సహకారాలు అందిస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అలాగే రాబోవు రోజులలో ఇలాంటి సేవలు మరిన్ని చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లయన్ వి హరీష్ చంద్ర, లయన్ సుందర్ రాజా నాయుడు, లయన్ శ్రీనివాసులు, లయన్ వెంకట చలపతి ,కౌన్సిలర్ అన్నా సలీం, డాక్టర్ కోటేశ్వరి మరియు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు

## ముఖ్యమంత్రి సహాయనిధి అందజేత



చాపాడు, ఆగస్టు 8, ప్రభాతవార్త :

మండలంలోని రాజు వారి పేట గ్రామానికి చెందిన వెన్నపూస రామసుబ్బారెడ్డిఇటీవల అనారోగ్యంతోఆసుపత్రిలో చేరి చికిత్స అనంతరం ఇంటికి తిరిగి వచ్చారు. సోమవారం ముఖ్యమంత్రి సహాయనిధి కింద మైదుకూరు శాసన సభ్యులు రఘురామిరెడ్డి చేతుల మీదుగా పది లక్షల చెక్కును బాధితునికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈయన వెంట మండల అధ్యక్షులు లక్ష్మయ్య. మండల కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి. ఎంపీడీవో శ్రీధర్ నాయుడు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## బస్టాండు నిర్మాణానికి పోస్టుకార్డు ఉద్యమం



దువ్వూరు, ఆగస్టు 8, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన దువ్వూరులో ఆర్టీసీ బస్టాండును నిర్మించాలని కోరుతూ మండల బీజేపీ ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమాన్ని చేపట్టినట్లు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆరవేటి హరికృష్ణ తెలిపారు. మండల వ్యాప్తంగా 4వేల మందితో పోస్టుకార్డు ద్వారా సీఎంకు దువ్వూరులో బస్టాండు నిర్మించాలని కోరుతూ ఈ కార్యక్రమాన్ని చేపట్టామని మండల ప్రజలు సహకరించాలన్నారు. సోమవారం సుమారు 400 కార్డులు బస్టాండు నిర్మించాలని కోరుతూ సీఎం కార్యాలయానికి పంపామన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు రాజగోపాల్‌రెడ్డి, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

## మొదలైన విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు

దువ్వూరు, ఆగస్టు 8, ప్రభాతవార్త:

దువ్వూరుకు సమీపంలోని పుల్లారెడ్డిపేట గ్రామంలో నూతనంగా వెలసిన శ్రీమహాగణపతి, శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయ విగ్రహ కలశ ధ్వజ పునఃప్రతిష్ట మహోత్సవాలు సోమవారం నుంచి మొదలయ్యాయి. సోమవారం సత్యనారాయణ, మహ మంగళ హారతి పూజా కార్యక్రమాలతో వీటిని ప్రారంభించినట్లు డీసీసీబీ మాజీ చైర్మన్ ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి తెలిపారు. 5 రోజుల పాటు జరిగే పూజా కార్యక్రమాల్లో 9వ తేదీన గురుప్రార్థన, యాగ మండప ప్రవేశం, 10న దీక్షా హోమం, నారాయణ హోమం, 11న హోమాలు, అభిషేకాలు, 12న హోమ అర్చన, అభిషేకాలు, 13న ప్రతిష్ట హోమం, యంత్రవిగ్రహ కళాన్యాసం, జ్వాలా దర్శనం, శ్రీసీతారామ దివ్య కళ్యాణమహోత్సవం, అమ్మవారికి ప్రథమ సార సమర్పణ, అలాగే గ్రామోత్సవం తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. 16న భక్తులకు అన్నదానం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో గ్రామస్థులు పాల్గొనాలని కోరారు.

## విద్యుదాఘాతంతో రైతు మృతి



కమలాపురం, ఆగస్టు 8, ప్రభాతవార్త:

కమలాపురం మండల పరిధిలోని లేటపల్లె గ్రామ పొలాల్లో సోమవారం ప్రమాదవశాత్తు జరిగిన విద్యుత్తు షాక్ సంఘటనలో అండ్లూరు కృష్ణారెడ్డి(65) మృతి చెందాడు. ఎస్సై కొండారెడ్డి ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు మాచనూరు గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి లేటపల్లె గ్రామం వద్ద రెండు ఎకరాల పొలం సాగు చేసుకుంటున్నాడు. అయితే సోమవారం పొలానికి నీరు కట్టే ప్రయత్నంలో భాగంగా స్టార్టర్ చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్తు షాక్‌కు గురి అయ్యారు. ఘటనా స్థలంలోనే ఆయన మృతి చెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నామని మృతుని భార్య సులోచనమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కొండారెడ్డి తెలిపారు.

## బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

**అట్లూరు, ఆగష్టు 08 ప్రభాతవార్త :**



జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు వెంగల్‌రావు యాదవ్, రాష్ట్ర ఇన్‌ఛార్జ్ నూకానమ్మ అధ్యక్షతన జరిగిన జాతీయ హక్కుల సాధనకై ఢిల్లీలో జరిగిన ఉద్యమానికి రాజ్యసభ సభ్యులు, 15 మంది లోక్‌సభ సభ్యులు పార్టీలకు అతీతంగా మద్దతు తెలిపారని, ఢిల్లీలో ఉద్యమం వెయ్యి మందితో ఆంధ్రప్రదేశ్ నుంచి వెళ్ళడం జరిగిందని, ఉద్యమం పూర్తి స్థాయిలో విజయవంతమై రాజ్యసభ ఎంపీలకు, లోక్‌సభ ఎంపీలు అందరికీ చట్టసభలో బీసీల బిల్లు పెట్టాల్సిందేనని నిర్ణయించడం జరిగింది. బీసీల బిల్లు పై ఆలోచించి నిర్ణయం తీసుకుంటామని చెప్పిన కేంద్రం నుండి ఉత్తర్వులు అందాయని, కాబట్టి ఢిల్లీలో ఉద్యమం విజయంతమైందని జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు బుర్రి రాజగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా నుండి 25 మంది పాల్గొనడం జరిగిందని, వారిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురుమూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వీరయ్య, కార్యదర్శి రామసుబ్బయ్య, రెడ్డెయ్య, జిల్లా కన్వీనర్ శంకర్, కార్యదర్శి రామ నరసింహులు, వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్రి వేణుగోపాల్, డబ్బుగుంటి రమణయ్య, బ్రహ్మేంద్ర కుమార్‌తో పాటు మరి కొంత మంది ఢిల్లీలో జరిగిన బీసీ సంఘం ఉద్యమంలో పాల్గొని విజయవంతం కావడానికి కృషి చేయడం జరిగిందని హర్షం వెల్లబుచ్చారు.

## వారసత్వ చారిత్రక కట్టడాలను విద్యుత్తు అలంకరణ చేయాలి

**కడప వైద్య విభాగం, ఆగస్టు 8, ప్రభాతవార్త:**



కడప నగరంలోని కలెక్టర్ స్పందన కార్యక్రమంలో డీఆర్వో రామ్మోహన్‌కు జేకే జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు లయన్ పఠాన్ ఖాదర్‌బాషా మరియు ఆర్కే సేవా సమితి రాహుల్ కరీముల్లా కలిసి కడప నగరంలో ఉండే చారిత్రక వారసత్వ కట్టడాలను విద్యుత్తు అలంకరణ చేయాలని వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఆజాదికా అమృత్ మహోత్సవ్ వేడుకలను ఆగస్టు 13 నుంచి 16 వరకు ఇంటింటా జాతీయ జెండా పండగ నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసిందన్నారు. శుభ సందర్భంలో కడప నగరంలో ఉండే చారిత్రక వారసత్వ కట్టడాలను పరిశుభ్రం చేసి వాటిని విద్యుత్తు దీపాలు, రంగులు వేసి అందంగా తీర్చిదిద్దాలని కోరారు. డీఆర్వో స్పందిస్తూ తప్పకుండా మనం వారసత్వ చారిత్రక కట్టడాలను విద్యుత్తు అలంకరణ చేస్తామని స్పందన ఎలా ఉందన్న కమిషనర్ సిబ్బందికి వినతిపత్రంలో ఆదేశాలు జారీ చేశారు.

## జాతీయ ఉద్యమ స్ఫూర్తితో ముందుకు నడుద్దాం..

**- కరపత్రాల ఆవిష్కరణలో సీపీఎం నేతలు**

**కడప వైద్య విభాగం, ఆగస్టు 8, ప్రభాతవార్త:**



కేంద్రంలోని బిజేపీ ప్రభుత్వం ఆజాదికా అమృత్ మహోత్సవ్ పేరుతో ఆగస్టు 1 నుంచి 15 వరకు కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చిందని, కానీ బీజేపీకి ఆ హక్కు లేదని సీపీఎం నగర కార్యదర్శి ఎ.రామమోహన్ పిలుపునిచ్చారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ ఉద్యమ స్ఫూర్తితో సీపీఎం ముద్రించిన కరపత్రాలను ఆ పార్టీ నాయకులు విడుదల చేశారు. బీజేపీకి, దాని మాతృ సంస్థ ఆర్ఎస్ఎస్‌కు జాతీయ ఉద్యమంలో పాల్గొన్న చరిత్ర లేదన్నారు. అనేక మంది పోరాటాలు, త్యాగం చేసిన చరిత్రని బీజేపీ ప్రభుత్వం వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నదన్నారు. ఇప్పటికైనా దేశంలో స్వాతంత్ర్యం స్ఫూర్తికి భిన్నంగా బీజేపీ పాలన కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి వర్గ సభ్యులు చంద్రారెడ్డి, నాయకులు ఫరూక్ డి.ఎం.ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

**ములకల చెరువు, ఆగస్టు 8, ప్రభాతవార్త:**

పీటీఎం మండలంలోని కందుకూరు సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఎదుట సోమవారం ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత నివసించారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణుల కొరకు బీమా సౌకర్యం, రుణాలు మంజూరు, పెన్షన్ తదితర కార్యక్రమాలపై పాటల రూపంలో వివరించారు. ఈ కార్యక్రమంలో కళాజాత సిబ్బంది బ్యాంకు అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## భారీగా సారా ఊట ధ్వంసం

**ములకల చెరువు, ఆగస్టు 8, ప్రభాతవార్త:**



ములకలచెరువు ఎస్ఈబీ కార్యాలయం పరిధిలో నిర్వహించిన దాడుల్లో భారీగా సారా ఊట ధ్వంసం చేసినట్లు ములకలచెరువు ఎస్ఈబీ సీఐ మల్లిక తెలిపారు. సీఐ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దమండ్యం మండలంలో నిర్వహించిన దాడుల్లో 200 లీటర్ల సారా ఊట ధ్వంసం చేసినట్లు తెలిపారు. అదే విధంగా ఎన్‌టిపి తాండా పరిసరాలలో నిర్వహించిన దాడుల్లో సుమారు 500 లీటర్లు సారా ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఎవరైనా తాండాల్లో సారా కాచినట్లు సమాచారం వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

## అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి

**ములకల చెరువు, ఆగస్టు 8, ప్రభాతవార్త:**



అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ములకలచెరువు మండలం, కాలువపల్లెకు చెందిన మహబూబ్‌బాషా కుమార్తె అసియా(17) అదే గ్రామానికి చెందిన కె.ఖాజాతో రెండేళ్ల క్రితం వివాహమైంది. కొద్ది రోజులుగా వీరిద్దరి మధ్య వివాదాలు చోటు చేసుకున్నాయి. సోమవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఆసియా చీరతో కొక్కికి ఉరి వేసుకొని మృతి చెందింది. కుటుంబ సభ్యులు, భర్త ఖాజా గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐఈ శివాంజనేయులు, ఎస్సై ఎర్రిస్వామిలు సంఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. మృతికి గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది. ఆసియా తండ్రి మహబూబ్‌బాషా ఫిర్యాదుతో అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు.

## ప్రభుత్వ పథకాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 8, ప్రభాతవార్త:**



ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫ లాలు నవరత్నాలు ప్రజల సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే గడికోట మో హన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం అప్ప కొండయ్య గారి పల్లెలో ఓ కార్య క్రమంలో పాల్గొని గ్రామంలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రతి ఇంటికి నవరత్నాలు అందుతున్నాయని ప్రజలు వాటిని సద్విని యోగం చేసుకోవాలన్నారు. సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం వెంటనే స్పంది స్తుందని ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలలతో లబ్ధి పొంది అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మద్దిరేవుల సుదర్శ న్‌రెడ్డి, సర్పంచి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు లక్ష్మీనారాయణ, శివశంకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ టిడిపి నాయకురాలు మృతికి సంతాపం

**నిమ్మనపల్లె, ఆగస్టు 8 ప్రభాతవార్త :**



మండలంలోని అగ్రహారం పంచాయితీ మాజీ సర్పంచ్ జయపద్మ అత్త, టిడిపి మండల సీనియర్ నాయకులు నరేంద్ర తల్లి సరసత్వమ్మ మృతిపై మదనపల్లె టిడిపి ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే దొమ్మల పాటి రమేష్ సంతాపం తెలిపారు. ఆయన సోమవారం అగ్రహారంలో భౌతికాయానికి సందర్శించి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి రెడ్డప్పరెడ్డి, మాజీ జడ్పిటిసి వసంత మునిరత్నం, పార్టీ మండల అధ్యక్షులు రమణ, నాయకులు సుధాకర్‌రావు, చెంద్రాయుడు విజయ్, చంద్ర, రామచంద్ర, చినబాబు పాల్గొన్నారు.

## విద్యార్థులు జాతీయ జెండాలతో ర్యాలీ

**పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 8 ప్రభాతవార్త :**



పిటిఎంలో ఆజాదీకా మహోత్సవంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని జడ్పిహై స్కూల్ విద్యార్థులు ప్రధానోపాధ్యాయులతో కలిసి విద్యార్థులు మువ్వెన్నల జెండాలతో ర్యాలీనిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయాల సిబ్బంది, ఉద్యోగులు, ప్రజలు త్రివర్ణ పతాకాలను ఇంటిపై ఎగరవేయాలని సూచించారు. ఈనెల 13నుంచి 15వరకు ప్రతి ఒక్కరూ జెండాలు ఎగురవేయాలన్నారు. పిటిఎంలో విద్యార్థులు ర్యాలీ సందర్భంగా విద్యార్థులుచేపట్టిన జాతీయ జెండాలతో రెపరెపలాడాయి.

## మొహారం పండుగ జోరు

**పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 8 ప్రభాతవార్త:**



మండలంలోని కందుకూరు గ్రామంలో కులమతాలకు అతీతంగా కలసీ పీర్ల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. గత ఆరు రోజులుగా కందుకూరు గ్రామంలో మొహారం పండగ సందర్భంగా నిప్పులు గుండాలను తొక్కి త్యాగాలను స్మరించుకోనున్నారు. ఈ పండుగ గ్రామంలోని ముస్లిం సోదరులు పీర్ల పంజాలను ఏర్పాలు చేశారు. ముస్లింలు హిందువులు, కలిసి భక్తిశ్రద్దలతో తమ మొక్కులను తీర్చుకొన్నారు. పీర్ల పంజాలకు ప్రార్థనలు చేశారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు పీర్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. బి.కొత్తకోట, పిటిఎం, ములకలచెరువు మండలాల ప్రజలు వేలాది మంది పాల్గొన్నారు. భక్తులు పీర్ల పండగను మొక్కులు తీర్చుకొన్నారు.

## మట్లివారిపల్లె విఆర్ఓగా ముజీబ్

**కురబలకోట, ఆగస్టు 8 ప్రభాతవార్త:**



కురబలకోట మండలం మట్లివారిపల్లె విఆర్ఓగా కెఎస్.ముజీబ్ సోమవారం విధుల్లో చేరారు. ఇక్కడ పనిచేస్తున్న ఎర్రయ్య బదిలీ కావడంతో ఈస్థలంలో మదనపల్లె మండలం వలసపల్లెలో పనిచేస్తున్న ముజీబ్‌ను బదిలీపై ఇక్కడికి వచ్చారు. రైతుల సమస్యలను అందరి సహకారంతో పరిష్కరిస్తానని తెలిపారు.

## పారదర్శక పాలనే ప్రభుత్వ ధ్యేయం

**ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి**

**వాల్మీకిపురం,ఆగస్టు 8 :ప్రభాతవార్త**



నిరుపేదలకు దళారుల వ్యవస్థ లేకుండా సంక్షేమ పథకాలు లబ్దిదారులకు పారదర్శక పాలనే ప్రభుత్వ ధ్యేయం అని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి అన్నారు.గడపగడప కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక పట్టణంలోని నాయక్‌వీధిలో స్థానికులకు సంక్షేమ పథకాలు లబ్ధిపై అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు సామాజికంగా అభివృద్ధి చెందినపుడే ప్రభుత్వ పథకాలకు సార్థకత చూకూరుతుందన్నారు.ప్రతి ఇంటా ఓ సంక్షేమ పథకం లబ్ది చేకూరుతుందని పేర్కొన్నారు.గత ప్రభుత్వం మాదిరి కమిటి కాలయాపన చేయకుండా, దళారుల వ్యవస్థకు స్వస్తి పలకడం జరిగింది.అర్హులైన ప్రతి ఒక్కరి ఎవరి ప్రమేయం లేకుండా పథకాలు వస్తున్నాయి.మౌళిక వసతుల కల్పనకు 20 లక్షల రూపాయల నిధులు మంజూరైనట్లు తెలిపారు.అనంతరం ఆయన స్థానిక ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆజాదీ కా అమృత్ ఉత్సవాల కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతో ప్రాణాలర్పించి పోరాడి జాతీయ నాయకుల త్యాగాలు ప్రతి ఒక్కరికి స్ఫూర్తి దాయకం కావాలని కోరారు.ఆజాదీ కా అమృత్ ఉత్సవ్ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు,విద్యార్థులు ప్రతిష్టాత్మకం నిర్వహించడం మంచి తరుణం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ షబ్బీర్ అహ్మద్,విద్యాత్ శాఖ ఏడి శ్రీనివాసులు,ఏఓ హేమలత,ఏఈ సుబ్బారెడ్డి,కమలాకర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఖితాబుద్దీన్, ఆనంద రెడ్డి,ఉపసర్పంచ్ బిడ్డల కేశవ రెడ్డి,ఆర్‌బికె చైర్మెన్ నీళ్ల భాస్కర్,నియోజకవర్గ మైనార్టీ నాయకులు అబ్దుల్ కలీమ్,నిర్దాల్ శ్రీధర్ రాయల్,చికెన్ మస్తాన్, సైపుల్లా,మహబూబ్ బాష,మియా,సత్యపాల్ రెడ్డి,రఘు, నందమూరి బాబు వివిధ శాకల ఉద్యోగులు,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నూతన పెంక్షన్లు పంపిణీ

**వాల్మీకిపురం, ఆగస్టు 8 :ప్రభాతవార్త**



నూతనంగా మంజూరైన వితంతు,వృధాప్య పెంక్షన్లను ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి పంపిణీ చేశారు.స్థానిక మండల కార్యాలయంలో లబ్దిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భం ఆయన మాట్లాడుతూ 350 నూతనంగా పెంక్షన్లు మంజూరైనట్లు పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు నిరుపేదలకు అందాలన్నారు.నవరత్నాలు అన్ని ప్రజలకు అందాలన్నదే ప్రభుత్వ ధ్యేయం.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ షబ్బీర్ అహ్మద్,మండల ప్రత్యేక ఆహ్వానితులు మహబూబ్ బాష,నాయకులు ఉపసర్పంచ్ కేశవ రెడ్డి,అబ్దుల కలీమ్,సైపుల్లా,గాండ్ల రమేష్,రఘు,మదనమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టిఐఎస్ ప్రకారం ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను సవరించాలి

**బద్వేలు, ఆగష్టు 08 ప్రభాతవార్త :**



ఉమ్మడి కడప జిల్లాలో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు మరియు తత్సమాన పదోన్నతులకు సంబంధించిన టెంటేటివ్ సీనియారిటీ జాబితాను జిల్లా విద్యా శాఖ, కడప అంతర్జాలం నందు పొందుపరిచిన జాబితాను టిఐఎస్ ప్రకారం సవరణ చేసి సీనియారిటీ జాబితాను తాజాగా పొందుపరచాలని పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి యం.రవి శంకర్ ఒక ప్రకటనలో జిల్లా విద్యా శాఖ అధికారిని కోరారు. ఉపాధ్యాయులు ప్రస్తుతం పని చేస్తున్న పాఠశాల నుండి సబ్జెక్టు వారీగా సీనియారిటీ జాబితాను పెట్టాలని, సోషల్ సబ్జెక్టు నందు ఎస్సీ, ఎస్టీ, పిహెచ్ కేటగిరీకి సంబంధించి సీనియారిటీ జాబితాను ఉంచాలని మరియు తెలుగుకు సంబంధించిన సీనియారిటీ జాబితాను పొందుపరచాలని కోరారు. ఎంఏ తెలుగు చేసిన వారికి ఎస్ఏ తెలుగులో పదోన్నతులు కల్పించాలని, ఉపాధ్యాయుల అభ్యంతరాలను మండల విద్యా శాఖాధికారి ద్వారా తీసుకోవాలని, జరగబోవు అన్ని పదోన్నతులు పారదర్శకంగా చేపట్టాలని కోరారు.

## స్పందనా సమస్యలపై ప్రత్యేక చర్యలు : ఆర్డీఓ మురళి

**మదనపల్లె, ఆగస్టు 8 ప్రభాతవార్త :**



స్పందనా అర్జీల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు ఆర్డీఓ ఎంఎస్.మురళి తెలిపారు. సోమవారం సబ్‌కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనా కార్యక్రమానికి రెవెన్యూ డివిజన్ పరిధిలోని 11మండలాల నుంచి ప్రజలు 41సమస్యలను అర్జీల రూపంలో ఆర్డీఓకు విన్నవించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రెవెన్యూ విభాగంకు సంబంధించి ఎక్కువగా స్పందనాలో ప్రజలు విన్నవించారన్నారు. అదే విధంగా సంక్షేమ పథకాలపై కూడా విన్నవించారన్నారు. వీటి పరిష్కారానికి గడువులోపు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాలు కూడా మంజూరు చేయడం జరుగుతుందన్నారు. చిన్న చిన్న సమస్యలను మండల స్థాయిలోనే తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్ళి ప్రజలు పరిష్కరించుకోవాలన్నారు.

## టమోటా ధరలపై జిల్లా కలెక్టర్ ఆరా

**మదనపల్లె, ఆగస్టు 8 ప్రభాతవార్త :**



టమోటా ధరల గురించి జిల్లా కలెక్టర్ పిఎస్.గిరీష అధికారులను అడిగి తెలుసుకొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు సంబంధించి బెంగుళూరు రోడ్డులోని విజయాడెయిరీ వెనుక ఉన్న మైదానాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా మైదానంలో టమోటాలు పారబోసిన దృశ్యాన్ని చూసి కలెక్టర్ అడిగి తెలుసుకొన్నారు. ధరలు లేకపోవడంతో రైతులు టమోటాలు మైదానంలో పారబోసారని కలెక్టర్‌కు వివరించారు. గత నెల రోజులుగా టమోటాలకు ధరలు లేకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని వివరించడం జరిగింది.

## అక్రమ కట్టడాలు నివారించండి

**స్పందనాలో ఛైర్‌పర్సన్‌కు విన్నపం**

**మదనపల్లె, ఆగస్టు 8 ప్రభాతవార్త :**



మున్సిపాలిటి పరిధిలోని వీవర్స్‌కాలనీలో రోడ్డుకు అడ్డంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని స్పందనాలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజారెడ్డికి ఆ ప్రాంత ప్రజలు విన్నవించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన స్పందనా కార్యక్రమానికి ఛైర్‌పర్సన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా పట్టణ ప్రజలు పలు సమస్యలను స్పందనాలో ఛైర్‌పర్సన్‌కు విన్నవించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పందనాలో ప్రజలు విన్నవించే సమస్యలను సత్వరం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా శానిటేషన్, నీటి ఎద్దడి, వీధిదీపాలు వాటిపై వెంటనే స్పందించాలన్నారు. అక్రమ నిర్మాణాలు కూడా పరిశీలించి వాటిని నివారించాలన్నారు. కార్యక్రమంలో కమీషనర్ ప్రమీల, ఆర్ఓ పల్లవి, టిపిఓ జకీరాఖాతూన్, డిఈ శీరీష తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో ప్రైవేటు బ్యాంకు ఉద్యోగి ఆత్మహత్య

**మదనపల్లెక్రైం, ఆగస్టు 8 ప్రభాతవార్త :**



అనారోగ్యంతో ప్రైవేటు బ్యాంకు ఉద్యోగి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలావున్నాయి. వాల్మీకిపురం మండలం శివపురంకు చెందిన శ్రీనాథ్(29) స్థానిక వైఎస్ఆర్‌నగర్‌లో నివాసం ఉంటూ ఓ ప్రైవేటు బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. ఇతనికి కొంతకాలంగా అనారోగ్యంతో భాదపడుతూ చికిత్సలు చేయించుకునేవాడు. ఆదివారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో జిల్లా ఆసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు.

## అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి

**ప్రతి ఇంటిముగింట మువ్వెన్నల జెండా రెపరెపలాడాలి**

**బూర్లపల్లె సర్పంచ్ సుబ్బిరెడ్డి**

**పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 8 ప్రభాతవార్త :**



ప్రభుత్వంనుంచి వచ్చే ప్రతి ఒక్క పథకాన్ని ప్రజలకు అందేలా చూడాలని బూర్లపల్లె సర్పంచ్ సుబ్బిరెడ్డి అన్నారు. పిటిఎం మండలంలోని బూర్లపల్లె గ్రామంలోని సచివాలయం ఆరణంలో సోమవారం ప్రజాప్రతినిధులు, సిసిలు, సంఘమిత్ర సభ్యులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా జరిగే ఆగస్టు నెలలో జరిగే సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సుబ్బిరెడ్డి పాల్గొని ప్రసంగించారు. పొదుపుసంఘాల మహిళలకు ప్రత్యేకించి నవరత్నాలభాగంగా సున్నావడ్డీ, ఆసరా, చేయూత, జగనన్న తోడు వంటి పథకాలు అర్హులకు దరిచేరాలన్నారు. పొదుపు సంఘాల మహిళలను పథకాలపై అడిగి తెలుసుకొన్నారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి జగనన్న గృహనిర్మాణాలు, పెన్షన్లు అందజేయాలన్నారు. అనంతరం ఆజాదీకా అమృత మహోత్సవంలో భాగంగా పురవీధుల్లో జాతీయ జెండాను చేతపట్టుకొని ర్యాలీ నిర్వహించారు. ఎందరో మహనీయుల త్యాగఫలం స్వాతంత్ర్యమని గుర్తు చేసుకొన్నారు. ప్రతి ఇంటిపై మువ్వెన్నల జెండా రెపరెపలాడాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్బిరెడ్డితో పాటు ఎంపిటిసి నాగార్జునరెడ్డి, ఏంపిఎం సాంబవివ, మాజీ ఎంపిటిసి రమణ పాల్గొన్నారు.

## గ్రీవెన్స్‌డేలో సమస్యలు పరిష్కారం

**కురబలకోట, ఆగస్టు 8 ప్రభాతవార్త:**



కురబలకోట ఎంపిడిఓ కార్యాలయంలో గ్రీవె న్స్‌డే సందర్భంగా సోమవారం మండలంలోని వివిధ గ్రామాల నుంచి సమస్యల పరిష్కారంకోసం కార్యాలయానికి ప్రజలు విచ్చేశారు. ఎంపిడిఓ దిలీప్ కుమార్‌కు ఫించన్లు, రేషన్‌కార్డులు మంజూరుచేయా లని కోరుతూ వినతిపత్రాలను అందజేశారు. పరి ష్కారం కోసం సంబంధిత గ్రామ సచివాలయాలకు అర్జీలను సమర్పించారు. పిచ్చలవాండ్లపల్లె, చేనేత నగర్ నుంచి ప్రజలు అర్జీలను సమర్పించారు.

## భూ ఘర్షణలో ఇద్దరికి కత్తిపోట్లు

**కురబలకోట, ఆగస్టు 8 ప్రభాతవార్త:**



కురబలకోట మండలం అంగళ్ళు పంచాయితీ పరిధిలోని తుమ్మచెట్లపల్లెలో ఆదివారం రాత్రి ఇరు వర్గాల వారు ఘర్షణ పడ్డారు. భూ తగాదాల వల్ల ఇరువర్గాల వారు కత్తులు, ఇనుపరాడ్లతో ఘర్షణ పడడంతో ఇద్దరు కత్తిపోట్లకు గురయ్యారు. ఈ ఘర్షణలో రమణ(55), శ్రీనివాసులు(50)లకు తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం మదనపల్లెలోని జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్సల అనంతరం తిరుపతికి తరలించారు. క్షతగాత్రులను మదనపల్లె డిఎస్‌పి రవిమనోహారాచారి విచారించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## తంబళ్లపల్లె వ్యవసాయ అధికారిగా రమణకుమార్

**తంబళ్లపల్లె, ఆగస్టు 8 ప్రభాతవార్త :**



తంబళ్లపల్లె మండల వ్యవసాయ అధికారిగా రమణకుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఏవో లీలాకుమారి బదిలీపై వెళ్లగా ములకలచెరువు నుండి రమణకుమార్ తంబళ్లపల్లెకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రైతుల సమస్యలపై సంబంధిత రైతు భరోసా కేంద్రాల సిబ్బంది సమన్వయంతో స్పందించేందుకు కృషి చేస్తామన్నారు. ఏడాది ఖరీఫ్ పంట వేయని రైతులకు ఉలవలు పంపిణీకి ఉన్నతాధికారులకు నివేదికలు పంపినట్లు చెప్పారు. ఆర్‌బీకే సిబ్బంది ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యటించి రైతులకు ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు, వ్యవసాయ పనిముట్లు పంపిణీకి సహకరించాలన్నారు.

## వేలంపాటల ద్వారా గుండ్లపల్లికి రూ.1.13లక్షల ఆదాయం

**- సర్పంచ్ మౌలాలి**

**తంబళ్లపల్లె, ఆగస్టు 8 ప్రభాతవార్త :**



తంబళ్లపల్లి మండలం గుండ్లపల్లి పంచాయతీకి ఐదు చేపల చెరువుల వేలంపాటల ద్వారా రూ.1,13,400 ఆదాయం వచ్చినట్లు సర్పంచ్ మౌలాలి తెలిపారు. సోమవారం సచివాలయంలో ఎంపీడీవో వెంకటరత్నం ఆధ్వర్యంలో కార్యదర్శి రమణ వేలంపాటలు నిర్వహించారు. పంచాయతీలోని మల్లికార్జున చెరువు, మల్లమ్మ చెరువు, ఎర్రమ్మ చెరువు, గరుడప్ప కుంట, ఊరబల్లికుంటలకు వేలం పాటల్లో స్థానికంగా గల రైతులే పాల్గొని దక్కించుకున్నారు. ఈ వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి ఖర్చు చేయాలని ఎంపీడీవో సర్పంచ్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ భాస్కర్‌రెడ్డితో పాటు సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ పనులు వేగవంతం చేయండి

**- ఏపీడీ నందకుమార్‌రెడ్డి**

**తంబళ్లపల్లె, ఆగస్టు 8 ప్రభాతవార్త**



తంబళ్లపల్లి మండలంలో ఉపాధిహామీ పనులు వేగవంతం చేయాలని ఏపీవో మాధవిని ఏపీడీ నందకుమార్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం ఆయినా ఎద్దులవారిపల్లిలో ఉపాధిహామీ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వర్షం కొంచెం తగ్గుముఖం పడితే మండలంలోని చెరువుల ఆయకట్టులోని కాలువల మరమ్మతు పనులు చేపట్టడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. గతంలో చేసిన పనులకు బిల్లులు పూర్తిగా చెల్లించడం జరిగిందని, స్థానిక రైతులు హార్టికల్చర్ పంటలైన మామిడి, జామ, మునగ, సపోటా, చింతచెట్లపై ఆసక్తి చూపిస్తున్నట్లు చెప్పారు. జగనన్న కాలనీల నిర్మాణాలకు 769 ఇళ్లకు ప్రతిపాదనలు వచ్చాయని, చేసిన పనుల వరకు బిల్లులు చెల్లింపునకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధిహామీలో నాటిన మొక్కల సంరక్షణకు ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ఈశ్వరప్ప అన్నదానం అందరికీ ఆదర్శం

**- సర్పంచ్ నీలూఫర్**

**తంబళ్లపల్లె, ఆగస్టు 8 ప్రభాతవార్త :**




తంబళ్లపల్లెకు సమీపంలోని మల్లయ్యకొండపై వ్యాపారి ఈశ్వరప్ప అన్నదానం చేయడం హర్షణీయమని, ఆయన అందరికీ ఆదర్శమని తంబళ్లపల్లె సర్పంచ్ నీలూఫర్ కొనియాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేడు మల్లయ్యకొండ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి చొరవతో ఎంతో అభివృద్ధి చెందిందని, భవిష్యత్తులో రాష్ట్రంలోనే ప్రముఖ శైవ క్షేత్రంగా నిలవడం ఖాయమన్నారు. సోమవారం ఉదయం ఎన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున భక్తులు హాజరవడంతో మల్లయ్యకొండ శివాలయం భక్తులతో కిటకిటలాడింది. నూతనంగా వచ్చిన భక్తులు మల్లయ్యకొండకఉ రోడ్డు, ఆలయ జీర్ణోద్దరణ, గెస్ట్‌హౌస్, తాగునీటి ట్యాంకు సౌకర్యాలపై స్పందిస్తూ ఇంతటి అభివృద్ధి పెద్దిరెడ్డి కుటుంబానికే చెల్లిందని హర్షం వ్యక్తం చేశారు.

## అనారోగ్యంతో వ్యాపారి ఆత్మహత్య

**మదనపల్లెక్రైం, ఆగస్టు 8 ప్రభాతవార్త :**



అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకొన్న సంఘటన సోమవారం పట్టణంలో చేసుకొంది. కుటుంబసభ్యుల కథనం మేరకు వివరాలిలావున్నాయి. పట్టణంలోని చంద్రాకాలనీకి చెందిన కుమార్‌ఆచారి(55) చిల్లర దుకాణం నిర్వహించుకునేవాడు. ఇతనికి భార్య, కుమారులు కలసి ఉన్నారను. ఇతని ప్రవర్తన నచ్చక భార్య పిల్లలు 5సంవత్సరాల క్రితం బెంగుళుకు పోయారు. అప్పటి నుంచి కుమార్ ఆచారి అదే కాలనీకి చెందిన మరో యువతితో ఉన్నట్లు సమాచారం. ఆదివారం రాత్రి ఆ మహిళ మృతి చెందింది. దీంతో సోమవారం ఉదయం కుమార్‌ఆచారి ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు రెండో పట్టణ పోలీసులు ఫిర్యాదుచేయడంతో పోలీసులు మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

## పిచ్చలవాండ్లపల్లెలో విద్యార్థులు ర్యాలీ

**కురబలకోట, ఆగస్టు 8 ప్రభాతవార్త:**



ఆజాదీక అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా సోమవారం పిచ్చలవాండ్లపల్లెలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పిచ్చలవాండ్లపల్లె ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు జాతీయ జెండాలను చేతబూని పురవీధుల్లో జాతి సమైఖ్యతను నినాదిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఇందులో భాగంగా కురబలకోట హైస్కూల్ మండలస్థాయి క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ క్విజ్ పోటీల్లో మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను జిల్లాస్థాయి క్విజ్ పోటీలకు పంపడం జరుగుతుందని ఎంఈఓ ద్వారకనాథ్ తెలిపారు.

## పేదల సొంతింటి కల సాకారం : జడ్పిటిసి

**కురబలకోట, ఆగస్టు 8 ప్రభాతవార్త:**



జగనన్న ప్రభుత్వం పేదల సొంతింటి కల సాకారం చేస్తోందని జడ్పిటిసి బైసాని జ్యోతి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ముంబై-చెన్నై రహదారిలో కంటేవారిపల్లె వద్ద జగనన్న లేవుట్లలో పక్కాగృహాలకు భూమిపూజచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సౌలభ్యంగా ఉండేందుకు కంటేవారిపల్లె వద్ద మూడు గ్రామ పంచాయితీలకు చెందిన కురబలకోట, ఎర్రబల్లి, కనసానివారిపల్లెలోని పేదలకు ప్లాట్లను ఇప్పటి వరకువంద మందికి కేటాయించారని తెలిపారు. ప్లాట్లు పారదర్శకంగా పేదలకు కేటాయించడం జరిగిందన్నారు. ఎంపిపి దస్తగిరిసాబ్ మాట్లాడుతూ లేవుట్లలో మంజూరైన లబ్దిదారులు సత్వరం గృహాలను నిర్మించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ భీమేశ్వర్‌రావు, ఎంపిడిఓ దిలీప్‌కుమార్, హౌసింగ్ ఏఈ వెంకటరెడ్డి, సర్పంచ్‌లు ఆర్‌కె.క్రిష్ణారెడ్డి, సుజాత మనోహర్, అనసూయ, కోఆప్షన్‌మెంబర్ ఎరసానుల్లా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# విశ్వసనీయతకు పట్టం కట్టండి

– మైదుకూరు ఎమ్మెల్యే రఘురామి రెడ్డి

**బ్రహ్మంగారి మఠం, ఆగస్టు 08 ప్రభాతవార్త :**



రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామలన్నిటిని అమలుచేసిన ఘనత మా ప్రభుత్వానిదే అని, విశ్వసనీయతకు పట్టం కట్టండని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామి రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఉదయం నుండి మండలంలోని సోమిరెడ్డిపల్లె సచివాలయం-2 పరిధిలోని యాదవ నగర్, మదిరెడ్డిపల్లె ఎస్సీ కాలనీ నందు "గడప గడపకూ మన ప్రభుత్వం" కార్యక్రమంలో మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామి రెడ్డి పాల్గొన్నారు. వారికి అభిమానులు, మహిళలు, గ్రామంలోని ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పేద ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏ విధంగా ప్రజలకు చేరుతున్నాయని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అడిగి తెలుసుకోగా ప్రతి కుటుంబం లబ్ధి పొందిందని పలువురు సంతోషం వ్యక్తం చేశారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు అర్హత కలిగిన వారు ఎవరు కూడా సంక్షేమ పథకాలు కోల్పోకూడదనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసి ముత్యాల రామగోవింద రెడ్డి, మండల అధ్యక్షులు చిలేకాంపల్లె వీరనారాయణ రెడ్డి, సొసైటీ బ్యాంకు ఛైర్మెన్ నేలటూరి సుబ్బారెడ్డి, సోమిరెడ్డిపల్లె ఎంపీటీసీ యల్లటూరు ఈశ్వర్ రెడ్డి, శివా రెడ్డి, స్థానిక సర్పంచ్ సోమిరెడ్డిపల్లె రామయ్య, రాజా నాయుడు, శంకర్ రెడ్డి, దుగ్గి రెడ్డి, ఎంపీటీసీ మనోహర్ ఆచారితో పాటు పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలుగా చింతకుంట ధనలక్ష్మి

14వ తారీఖున ప్రమాణ స్వీకారోత్సవాన్ని జయప్రదం చేయాలి

– ఆర్యవైశ్య మహిళా మండలి స్టేట్ ఉపాధ్యక్షురాలు కొండపల్లి దేవి

**బద్వేలు అర్బన్, ఆగస్టు 08 ప్రభాతవార్త :**





ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలుగా చింతకుంట ధనలక్ష్మిని ఎంపిక చేసినట్లు ఆర్యవైశ్య స్టేట్ మహిళా మండలి ఉపాధ్యక్షురాలు కొండపల్లి దేవి తెలియజేశారు. అనంతరం కొండపల్లి దేవి మాట్లాడుతూ చింతకుంట ధనలక్ష్మి గత అనేక సంవత్సరాలుగా ఆర్యవైశ్య మహిళా మండలి కమిటీ సభ్యురాలుగా ఉంటూ ఎక్కడ ఏ కార్యక్రమాలు జరిగినా ఉత్సాహంగా పాల్గొంటూ మహిళా మండలి ఆధ్వర్యంలో చేపడుతున్న పలు కార్యక్రమాలకు ఎంతగానో కృషి చేశారన్నారు. అయితే ఇటీవల వనితా క్లబ్ సెక్రటరీగా కూడా పట్టణంలో వారి వంతు సహాయ సహకారాలు అందించారన్నారు. ఆమె సేవలను గుర్తించి ఆర్యవైశ్య మహిళా మండలి పట్టణ అధ్యక్షురాలుగా నియమించడం జరిగిందన్నారు. ఈ నెల 14వ తారీఖు ఆదివారం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి సన్నిధిలో ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, కావున ఈ కార్యక్రమానికి పట్టణంలోని ఆర్యవైశ్య మహిళలందరూ పాల్గొని జయప్రదం చేయాలని వారు తెలియజేశారు.

**పేద ఆర్యవైశ్యులకు చేయూతనిచ్చే లక్ష్యంతో కృషి చేస్తాం:**

పట్టణంలో ఉన్నటువంటి పేద ఆర్యవైశ్యులకు చేయూతనిచ్చే లక్ష్యంతో కృషి చేస్తామని ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలుగా ఎంపికైన చింతకుంట ధనలక్ష్మి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ సేవలను గుర్తించి ఆర్యవైశ్య మహిళా మండలి స్టేట్ ఉపాధ్యక్షురాలు కొండపల్లి దేవి తనను ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలుగా నియమించడం సంతోషకరం అన్నారు. పలువురు ఆర్యవైశ్య మహిళలందరితో కలిసి మెలిసి ఉంటూ మహిళా మండలి వారి ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాలన్నీ కూడా జయప్రదం చేసే విధంగా కృషి చేస్తామని వారు పలువురికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**– చింతకుంట ధనలక్ష్మి, ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు.**

# కాపు సంక్షేమ సేన మహిళా అధ్యక్షురాలుగా రెడ్డిరాణి

**సుండుపల్లి, ఆగస్టు 8ప్రభాతవార్త:**



కాపు సంక్షేమ సేన అన్నమయ్య జిల్లా అధ్యక్షురాలుగా నన్ను ఎన్నుకోవడం గర్వంగా భావిస్తున్నానని, నూతనంగా అన్నమయ్య జిల్లాకు ఎన్నికైన నంద్యాల రెడ్డి రాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడుతూ కాపు బలిజ ఒంటరి తెగల అభివృద్ధి కోసం జాతిలో ఉన్న మహిళలను చైతన్య పరుస్తూ జిల్లా అధ్యక్షురాలుగా నాపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పజెప్పిన రాష్ట్ర, వ్యవస్థాపక అధ్యక్షులు చేగుండి హరి రామజోగయ్య, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పద్మజ నాకి ఈ పదవి రావడానికి కృషి చేసిన కడప, అన్నమయ్య జిల్లాల కోఆర్డినేటర్ యర్రంశెట్టి మస్తాన్‌రాయులు, కాపు యువసేన రాష్ట్ర కార్యదర్శి అనంతరాయలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. కాపు సంక్షేమ సేన రాష్ట్ర నాయకులందరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. నాపై పెట్టిన నమ్మకాన్ని జాతికోసం పని చేసేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా రెడ్డిరాణి తెలిపారు.

# ఇంటి స్థలాలకోసం రిలే నిరాహారదీక్షలు

**ఒంటిమిట్టఆగస్టు8ప్రబాతవార్థ:**



ఈనెల 10 తేదీనుంచి మండల విలేకరులు ఇంటిస్థలాల కోసం రిలే నిరాహారదీక్షలు చేయనున్నరు. ఇందుకు సంబందించి సోమవారం తహసిల్దార్ శ్రీనివాసులరెడ్డికి, యస్ ఐ సంజీవరాయుడుకు వినతి పత్రం అందజేశారు. గతంలో ఇంటిస్థలాల కోసం రిలే నిరాహారదీక్షలు , ఆమరణ నిరాహారదీక్షలు చేశారు.కానీ ఆదికారులుఇంతవరకు ఇంటి స్థలాలు ఇవ్వలేదు. ఆదికారులు, ప్రజాప్రతినిదులు హామీలు ఇచ్చారు. కానీ ఆ హామీలు ఆమలుకు నోచుకోలేదు.దీంతోమళ్ళి మండల విలేకరులు దీక్షలు చేయనున్నరు. 10వ తేదీనుంచి దీక్షలు చేస్తున్నట్లు

# జలజీవన్‌మిషన్ పై అవగాహన సదస్సు

**ఒంటిమిట్ట ఆగస్టు 8 ప్రబాతవార :**



ప్రతి రోజు ప్రతి ఒక్కరికి 55 లీటర్లు రక్షిత మంచి నీటి కుళాయి ద్వారా 2024 నాటికి అందచేయడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టినటువంటి జల ఉద్యమం ఈ జల జీవన్ మిషన్ అని ఎంపిపి గడ్డం జనార్ధన్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఎంపిడిఓ కార్యలయంలో జల జీవన్ మిషన్ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ కుమార రంగయ్య,ఎఈ అనుసూయరాణి, ఆదికారులు లవకుమార్‌రెడ్డి, పాల్గోన్నారు.

# మున్సిపల్ ఛైర్మెన్ దృష్టికి 11వ వార్డు సమస్యలు

వార్డు సమస్యలు పరిష్కరిస్తాం – ఛైర్మెన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డి

**బద్వేలు అర్బన్, ఆగస్టు 08 ప్రభాతవార్త :**



మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు మంగల కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని సోమవారం పలువురు కాలనీ వాసులు మున్సిపల్ ఛైర్మెన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళారు. మున్సిపాలిటీ పరిధిలోని 35 వార్డులలో 60 శాతం పైగా రోడ్ల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని, అదే విధంగా 11వ వార్డులో కూడా సీసీ రోడ్డు పనులను త్వరితగతిన చేపట్టి వార్డు అభివృద్ధికి కృషి చేయాలని పలువురు కాలనీ ప్రజలు ఛైర్మెన్‌కు విన్నవించుకున్నారు. స్పందించిన మున్సిపల్ ఛైర్మెన్ వాకమళ్ళ రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ వార్డులో సమస్యలను పరిష్కరించి 11వ వార్డు పరిధిలోని అన్ని వీధులలో సీసీ రోడ్లు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని వార్డు ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు గోపాల్ రెడ్డి, కుప్పాల రమణ, సుబ్బరాజా మరియు వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్సీ

**బద్వేలు అర్బన్, ఆగస్టు 08 ప్రభాతవార్త :**



పట్టణంలోని అశోక్‌నగర్ లో నివాసం ఉండే యాదాళ్ళ కృష్ణమూర్తి, సతీమణి సుజాత కుమారుడు వెంకట ఉదయ్ కుమార్ గుప్తా, మల్లిక దంపతులను సోమవారం ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డి, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మెన్ కల్లూరు రమణారెడ్డి, మున్సిపల్ వైస్ ఛైర్మెన్ రాచపూడి సాయి కృష్ణతో పలువురు నాయకులు ఆశీర్వదించారు. వివాహ వేడుక రెసెప్షన్ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరైన ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డితో పాటు పలువురు వైసీపీ నాయకులను యాదాళ్ళ కృష్ణమూర్తి శాలువా, గజమాలతో సత్కరించారు. తదనంతరం ఏర్పాటు చేసిన విందులో వారు పాల్గొనడం జరిగింది.అలాగే డా॥ వీరనారాయణ కుమార్తె వివాహానికి ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మెన్ రాచపూడి సాయి కృష్ణ, డా॥ వీర నారాయణ, కొలిశెట్టి కృష్ణయ్య, యాదాళ్ళ సిద్దేశ్వరరావు, బైసాని కార్తీక్‌తో పాటు పలువురు ఆర్యవైశ్యులు, నాయకులు పాల్గొన్నారు.

# గడప గడపకు మన ప్రభుత్వం

**పెండ్లిమర్రి, ఆగస్టు 8, ప్రభాతవార్త:**



పెండ్లిమర్రి మండలం చీమలపెంట గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సోమవారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గడప గడపకు వెళ్లి ప్రజలతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే సత్వరం స్పందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, మండల కన్వీనర్ మాచునూరు చంద్రారెడ్డి, జడ్పీ వైస్ ఛైర్మన్ బాలయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి : వీసీలో కలెక్టర్

**ఓబులవారిపల్లె, ఆగస్టు 8, ప్రభాతవార్త:**



ఓబులవారిపల్లె మండలంలోని 22 పంచాయతీల్లో శాఖాపరమైన సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సోమవారం గ్రీవెన్స్ సెల్ సందర్భంగా అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరిష వీసీలో మండల స్థాయి అధికారులతో సమావేశమై పలు సమస్యలపై చర్చించారు. ఉపాధి హామీ, జగనన్న వసతి గృహాల పనితీరు, గ్రామ సచివాలయాల పనితీరు, వ్యవసాయ, విద్యుత్తు తదితర భూ సమస్యలు, పింఛన్లు, రెవెన్యూ సమస్యలను అన్నింటిపైన సమావేశం నిర్వహించి శాఖాపరమైన అధికారులతో వివిధ ప్రజా సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి అధికారి శాఖాపరమైన ప్రజా సమస్యలు తమ దృష్టికి వినతుల ద్వారా వచ్చిన వాటిని తక్షణమే పరిష్కరించాలని తెలిపారు. ఎవరైనా నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో తహసీల్దారు పీరూమున్నీ, ఎండీఆవో విజయారావు, ఈవోపార్డీ కృష్ణమూర్తి, ఉపాధి హామీ ఏపీవో వెంకటేశ్వర్లు, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పోటీలతోనే సృజనాత్మకత, నైపుణ్యాల వెలికితీత

**వేంపల్లె, ఆగస్టు 8, ప్రభాతవార్త :**



విద్యార్థులకు తరచూ పోటీలు నిర్వహించడం వల్ల వారిలోని సృజనాత్మకత, నైపుణ్యాలు వెలికి తీయవచ్చని వేంపల్లె వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ యోగాంజనేయులు అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా సోమవారం వేంపల్లె వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే తమ ధ్యేయం అన్నారు. విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా అధ్యాపకులు డాక్టర్ సుగుణమ్మ, డాక్టర్ మల్లేశ్వరమ్మ, ఎస్.షర్ఫుద్దీన్‌లు న్యాయ నిర్ణేతలుగా వ్యవహించారు. వకృత్వం పోటీల్లో ఉజ్మ, అజమ్మతుల్లా, బాలాజిలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలవగా వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ నాగేంద్ర, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటరు ఎం.ఓబుళరెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# రామాయపల్లి నుండి పీర్లకు సానికెలు తీసుకొచ్చిన గ్రామస్తులు

**పోరుమామిళ్ళ రూరల్, ఆగస్టు 8ప్రభాతవార్త:**



రామయ్యపల్లె గ్రామం నుండి పిడుగువారి వంశస్తులు అనేక సంవత్సరాల నుండి ఉద్దికట్టలో ఉన్న దర్గా వద్దకు సానికెలు, రెండు ట్రాక్టర్ల మొద్దులు, మౌలాలి, పెద్ద పీరయ్య స్వామికి మంగళవాయిద్యాలతో గంధం, స్వామివారికి పూజా సామాగ్రితో అత్యంత వైభవంగా స్వామివారికి ఇవ్వడం జరిగింది. అనంతరం రామాయపల్లి గ్రామంలో 300ల మందికి భోజన సౌకర్యం ఏర్పాటు చేసుకొని ప్రజలందరికీ భోజనం చేయడం జరిగింది. గ్రామంలో పిల్లలు, పెద్దలు అందరూ డ్యాన్స్‌లు వేయడం, కర్ర తిప్పడం, పెద్దపులి అడుగులు వేయడం, ఎటువంటి అంతరాయం కలగకుండా స్వామివారికి సానికెలు, పూజా సామాగ్రితో సమర్పించి వారికి ఎన్నో రోజుల నుండి అనవాయితీగా వస్తున్న ఆచారాన్ని మరవకుండా వారి పెద్దలు నేర్పిన అడుగుజాడల్లో ఈనాటికి ఈ పండుగ చేయడం సంతోషకరమైన విషయం. ఈ కార్యక్రమంలో రామయ్యపల్లె పిడుగువారి వంశస్తులు శ్రీకాంత్, పీరయ్య, చిన్న పీరయ్య, మస్తాన్, మధుసూదన్ రావు, రమణయ్య, నారాయణ, జైకుమార్, శ్రీను, చిన్నరాముడు, సూర్యనారాయణ, చిన్న పేరయ్య, మోహన్, విజయ్, విశ్వనాథ్, బొగ్గువరం మస్తాన్, నాగేంద్ర బాబు, రవిచంద్ర, సిద్దయ్య, నాగురయ్య, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఈడిగపల్లెలో ఘనంగా పీర్ల పండుగ

**వీరబల్లి, ఆగస్టు 8, ప్రభాతవార్త:**

మండల కేంద్రం సమీపంలోని ఈడిగపల్లెలో ఆదివారం పీర్ల పండుగ ఘనంగా జరుపుకొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పీర్ల చావిడి దగ్గర అగ్ని గుండం నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామున అగ్ని గుండంలో భక్తులు ప్రవేశించారు. తురకపల్లె నుండి వచ్చిన పీర్లు సలాం అందుకోవడం జరిగింది. ఈ సన్నివేశాలు భక్తులు, ప్రజలను అలరించాయి. మొక్కుబడులు ఉన్న భక్తులు చాందిని బండ్లు, బాసకాలు కట్టి పీర్లు చావిడిలో సమర్పించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎస్ఐ మహ్మద్‌రఫీ ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. రాయచోటి సిఐ లింగప్ప పీర్ల పండుగను పరిశీలించి ఎటువంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాజేంద్ర, టిడిపి నాయకులు జగన్‌మోహన్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గోవు మృతిచెందితే యజమానులకు శిక్ష తప్పదు

సిఐ ఎస్.విశ్వనాథ్‌రెడ్డి

**రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 8 ప్రభాతవార్త**



రైల్వేకోడూరు పట్టణంలో గోవు ప్రమాదాల ద్వారా ఎవరివైనా చనిపోతే గో యజమానులకు శిక్ష తప్పదని రైల్వేకోడూరు సిఐ ఎస్.విశ్వనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక సిఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గోసంరక్షకులు గోవులను పట్టణంలోని ప్రధాన రహదారుల వద్దకు వస్తే ఆ సమయంలో ప్రమాదం జరిగితే గో యజమానులపై కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశామని సిఐ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. ఇటీవల కాలంలో కోడూరు పట్టణంలో గోవులు విస్తారంగా ప్రధాన రహదారిపై వాహన రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నారని అలా జరిగితే వాహనదారుల విజ్ఞప్తి మేరకు గోవుల యజమానులపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేస్తామని ఆయన హెచ్చరించారు. ఇప్పటికైనా గోవులకు సంబంధించిన యజమానులు రోడ్డుపై ఉండే పశువులను, వారి వారి నివాస గృహాలకు తరలించి వాహనదారులకు ముఖ్యంగా రాత్రి సమయంలో ఆటంకాలు జరగకుండా చేయాల్సిన బాధ్యత వారిపై ఉందని అన్నారు. అదేవిధంగా ఇచ్చిన షరతులను పశువుల యజమానులు నిర్లక్ష్యం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని సిఐ హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఐ-2 హేమాద్రి పాల్గొన్నారు.

# బొజ్జావారిపల్లె వడ్డిపల్లెలో పంజం ప్రత్యేక పూజలు

**రైల్వేకోడూరు, ఆగస్టు 8 ప్రభాతవార్త**

రైల్వేకోడూరు మండలంలోని బొజ్జావారిపల్లె గ్రామానికి చెందిన వడ్డిపల్లెలో రేణుకా ఎల్లమ్మతల్లి పూజా కార్యక్రమాలకు రైల్వేకోడూరు నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకులు, అన్నమయ్య జిల్లా రైతు సలహామండలి ఛైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా దేరంగుల సుబ్బన్న, దేరంగుల ఎల్లయ్య, శంకర, పురుషోత్తం, తుపాకుల శంకర్‌లు పంజం సుకుమార్‌రెడ్డిని గజమాలలతో స్వాగత సత్కారాలతో ఘనంగా సన్మానించారు.

# గుండ్లూరులో గంగమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం

**రాజంపేట అర్బన్, ఆగస్టు 8 ప్రభాతవార్త**

మండలంలోని గుం డ్లూరులో గంగమ్మతల్లి ఆల య పునర్నిర్మాణం పనులు సోమవారం ప్రారంభమ య్యాయి. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ఉదయం హోమాలను ఏర్పాటు చేశారు. తర్వాత రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం గుండ్లూరు పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు, స్థానికులు, మహిళా భక్తులు అధికంగా పాల్గొన్నారు.

# స్పందన కార్యక్రమానికి అధికారులు హాజరు కావాలి

**రామాపురం, ఆగస్టు 8, ప్రభాతవార్త:**



ప్రతి సోమవారం జరిగే స్పందన కార్యక్రమానికి మండల అధికారులు తప్పక హాజరు కావాలని తహశీల్దార్ సత్యానందం అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆయా గ్రామాల నుంచి వచ్చే సమస్యలు పరిష్కరించేందుకు హాజరు కాలవాలని, ఆయా శాఖల అధికారులు ఉంటే అక్కడే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. స్పందన కార్యక్రమానికి రాని అధికారులపై చర్యలు తీసుకొంటామని, ఈ విషయం పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. సోమవారం స్పందన కార్యక్రమానికి ఆరు మంది దరఖాస్తులు చేశారన్నారు. వీటిలో కొన్ని రెవిన్యూ, ఆన్‌లైన్, రేషన్‌కార్డు మార్పులు, చేర్పులపై దరఖాస్తులు వచ్చాయన్నారు.

# ఆజాదికా అమృత్ మహోత్సవంపై అధికారుల ర్యాలీ

**ఓబులవారిపల్లె, ఆగస్టు 8, ప్రభాతవార్త:**



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారత స్వాతంత్ర్య సమరయోధులు దేశం కోసం ప్రాణాలు అర్పించిన త్యాగమూర్తులను స్మరించుకొనే విధంగా దేశంలో భక్తి ఉట్టి పేడలా సోమవారం ఆజాదికా అమృత్ మహోత్సవంపై మండలంలో పలు చోట్ల జాతీయ జెండాతో అన్ని శాఖల అధికారులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ముక్కవారిపల్లె, కొర్లకుంట క్రాస్ రోడ్డు, ఓబులవారిపల్లె క్రాస్ రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు వరకు అధికారులు ర్యాలీ భారతదేశ స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులు అర్పిస్తూ, వారిని స్మరించుకొంటూ భరతమాతకు జై అంటూ జైజైలు పలుకుతూ ర్యాలీ నిర్వహించారు. బారతదేశ ఔన్నత్యాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఓబులవారిపల్లె ఎంపీడీవో విజయారావు, తహసీల్దారు పీరూమున్నీ, ఎస్సై వెంకటేశ్వర్లు, ఈవోపీఆర్డీ కృష్ణమూర్తి, వెలుగు ఏపీఎం ఆర్ముగం, పాఠశాల విద్యార్థులు, వెలుగు సిబ్బంది, పంచాయతీ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హిందూముస్లీం ఐక్యతకు మారుపేరే మొహరం

**రామాపురం, ఆగస్టు 8, ప్రభాతవార్త:**



హిందూముస్లీంలు కలిసిమెలసి జరుపుకొనే పండుగ మొహరం పండుగ (పీర్లపండుగ). మండలంలో గంగనేరు, హసనాపురం, చిట్లూరు, బండపల్లె, పొలిమేరపల్లె గ్రామాలలో పీర్ల పండుగను హిందూముస్లీం సోదరులు ఘనంగా జరుపుకొన్నారు. మొహరం పండుగను పురస్కరించుకొని పీర్లను రంగు రంగుల పుష్పాలతో అలంకరించి ముస్తాబు చేశారు. మంగళవారం పీర్లను గ్రామాలలో ఊరేగించి హసనాపురం కస్పాలో గల పీర్లతో సలాం అందుకొన్న అనంతరం తిరిగి వారి వారి గ్రామాలు చేరుకొని మంగళవారం రాత్రికి ఊరేగింపు వేడుకలు ముగుస్తాయన్నారు. ఈ వేడుకలలో హిందూముస్లీంలు అనే బేదం లేకుండా జరుపుకోవడం విశేషం.

# వివిధ కోర్టులకు న్యాయమూర్తుల నియామకం

**కడప లీగల్, ఆగస్టు 8, ప్రభాతవార్త:**

జిల్లాలో ఉన్న వివిధ కోర్టులకు ఇటీవల జరిగిన జూనియర్ సివిల్ జడ్జీ నియామకాలలో ఎంపికైన న్యాయవాదులను వివిధ కోర్టులకు జూనియర్ సివిల్ జడ్జీలుగా నియమిస్తూ రాష్ట్ర హైకోర్టు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న మొదటి అదనపు మెజిస్ట్రేట్ కోర్టుకు జూనియర్ సివిల్ జడ్జీగా జిల్లాకు చెందిన నందిని, మైదుకూరు జూనియర్ సివిల్ జడ్జీగా కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన ఖాజామైనుద్దీన్‌ను, ప్రొద్దుటూరు 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జీగా, పుంగనూరుకు చెందిన అనిల్‌కుమార్ నాయక్‌లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జడ్జీలుగా నియమితులైన వారు బాధ్యతలు స్వీకరించాల్సి ఉంది.

# ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పాత్రికేయుల సేవలు అమోగం

– జిల్లా కలెక్టర్ గిరీష పి ఎస్, జిల్లా ఎస్పి హర్షవర్ధన్‌రాజు



కలెక్టర్‌కు బొకెను అందజేస్తున్న బ్యూరో, రాయచోటి ఇన్‌చార్జి

**రాయచోటి, ఆగస్టు 8, ప్రభాతవార్త:**

ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పాత్రికేయులు అందిస్తున్న సేవలు అమోగమని అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీష పి ఎస్ పేర్కొన్నారు. సోమవారం రాయచోటి పట్టణం మదనపల్లె రోడ్డు నందు నూతనంగా ఏర్పాటు చేసిన వార్త దినపత్రిక కార్యాలయాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమానంలో జరుగుతున్న ప్రతి విషయాన్ని పాత్రికేయులు ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేయడం ప్రతి ఒక్కరు గర్వించదగ్గ విషయమన్నారు. నూతన అన్నమయ్య జిల్లాలో వార్త కార్యాలయాన్ని ప్రారంభించడం ఎంతో శుభ పరిణామమన్నారు. వార్తా కార్యాలయం దిన దినాభివద్ధి చెంది ప్రజలకు మరింత చేరువ కావాలని ఆయన ఆకాంక్షించారు.

**ప్రజాస్వామ్య పరిరక్షణకు పత్రికలు ఎంతో ముఖ్యం-ఎస్పి హర్షవర్ధన్‌రాజు**

ప్రజాస్వామ్య పరిరక్షణకు పత్రికలు ఎంతో తోడ్పాటును అందిస్తాయని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పత్రికలు పని చేయాలని జిల్లా ఎస్పి హర్షవర్ధన్‌రాజు అన్నారు. సోమవారం అన్నమయ్య జిల్లా వార్త కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులు నీతి నిజాయితీగా మంచి వార్తలు రాసి సమాజానికి ఉపయోగపడాలని కోరారు. అనంతరం డిఎస్పి శ్రీధర్ మాట్లాడుతూ నిర్భంగా విలేకరులు వాస్తవాలు వార్తల రూపంలో నిఖచ్చిగా వాస్తవాలు రాయాలని అప్పుడే పత్రికల లక్ష్యం నెరవేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు రఫీ, నరసింహారెడ్డి, జిల్లా సమాచార శాఖ అధికారి పురుషోత్తం, వార్త బిఎం, బ్యూరో రఘునాథ, సీనియర్ మేనేజర్ వెంకటేశ్వరరావు, ఎడిషన్ ఇన్ చార్జి సురేష్, అడ్వటేజ్‌మెంట్ మేనేజర్ గురుప్రసాద్, రాయచోటి ఇన్‌చార్జి వెంకటరామిరెడ్డి, రామాపురం జడ్పిటిసి మాసన వెంకటరమణ, లయన్, సర్పంచ్ నాగార్జునాచారి, లయన్ శివారెడ్డి, మహ్మద్, చెన్నారెడ్డి పాత్రికేయులు పాల్గొన్నారు.



ఎస్పికి పూలబొకెను అందజేస్తున్న ఆర్‌సి ఇన్‌చార్జి, పాత్రికేయులు

# భయం వీడితే జయం మీదే – నాగప్రసాద్

**రాయచోటి, ఆగస్టు 8ప్రభాతవార్త:**



భయం వీడితే జయం మీదేనని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు నాగప్రసాద్ అన్నారు. రాయచోటి పట్టణం శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగప్రసాద్ మాట్లాడుతూ భయం వీడితే జయమని పట్టుదల ఉంటే లక్ష్యాన్ని సులువుగా సాధిస్తారని ఆయన అభిప్రాయపడ్డారు. లక్ష్యసాధనకు అతినిద్ర సోమరితనం వాయిదా వేయడం రుణాత్మక ఆలోచనలు మొహమాటం వంటి ఐదు అంశాలను వదులుకోవాలని, ఈ పోటీ ప్రపంచంలో భావ ప్రకటన స్వేచ్ఛను పెంపొందించుకోవాలని విద్యార్థిని విద్యార్థులకు ఆయన సూచించారు. సంకల్ప బలమే విజయానికి నాంది అని, మన స్ఫూర్తిగా ఏది కోరుకుంటే అది ఖచ్చితంగా సాధిస్తారని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. బాలాజీ, పాలిటెక్నిక్ విభాగాధిపతి ప్రతాప్‌రావు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# జెసిబితో మరమత్తులు చేసిన సర్పంచ్ సుధాకర్

**పోరుమామిళ్ళ రూరల్, ఆగస్టు 8ప్రభాతవార్త:**



మొహరం సందర్భంగా పోరుమామిళ్ళ మేజర్ గ్రామ పంచాయతీల్లో మంగళవారం పీర్లు, గుమటాలు పెద్ద పులివేషాలు, గొప్ప ఊరేగింపుగా గవర్నమెంట్ పీర్ల సావిడి దగ్గర నుండి శెట్టిగారి బజారు మీదుగా తంబా బావివీధి, బలిజకోట, 4వ సచివాలయం మీదుగా మలకత్తకు వెళ్లుదారిలో ఇరువైపులా ఉన్న చెట్లు, రోడ్డు గుంతలు జెసిబి ద్వారా సర్పంచ్ యనమల సుధాకర్ సోమవారం దగ్గరుండి పనులు చేపించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# అనుమానస్పదంతో వ్యక్తి మృతి

**వీరబల్లి, ఆగస్టు 8, ప్రభాతవార్త:**

మండలంలోని వీరబల్లి పంచాయితీ వడ్డెపల్లెకు చెందిన మదన్ (45) అనే వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. వివరాలలోకి వెళితే ఆదివారం రాత్రి ఈడిగపల్లెలో పీర్ల పండుగ జరగడంతో మదన్ నాయినివారిపల్లెలో కట్టిన చాందిని బండి వెంట వచ్చినట్లు బంధువులు తెలిపారు. గడికోట, వీరబల్లి రోడ్డు మార్గంలోని చెక్‌పోస్టు సమీపంలో రోడ్డుపై పడి తలకు బలమైన గాయాలు తగిలి పడి ఉన్నాడు. ఈ విషయం తెలుసుకొన్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆ వ్యక్తిని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు గుర్తించారు. మృతి చెందిన వ్యక్తిని ఎవరో కొట్టి చంపినట్లు బంధువులు తెలుపుతున్నారు. అనుమానస్పదంగా మృతి చెందినట్లు రూరల్ సిఐలి ఒగప్పకు కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# దేశానికి ఉపయోగకరంగా లేని 'నీతిఆయోగ్'

**వేంపల్లె, ఆగస్టు 8, ప్రభాతవార్త :**



ప్రణాళికా సంఘం స్థానంలో ప్రధాని మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన నీతిఆయోగ్ నిరర్థకంగా తయారైందని, దేశానికి ఏ మాత్రం ఉపయగకరంగా లేదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రణాళికా సంఘం కాంగ్రెస్ పార్టీ మానసపుత్రిక అని చెప్పారు. దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. మోదీ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత 2015 జనవరి1న నీతి ఆయోగ్ ఏర్పాటు చేశారన్నారు. ఆదివారం ఢిల్లీలో జరిగిన నీతిఆయోగ్ సమావేశంలో కేంద్రం నుంచి రాష్ట్రానికి రావల్సిన నిధులు, కేంద్రం పరిష్కరించాల్సిన రాష్ట్ర సమస్యలను ప్రస్తావించకుండా వ్యవసాయ, విద్యా రంగాల్లో వైకాపా ప్రభుత్వం అద్భుతాలు సాధించినట్లు ముఖ్యమంత్రి జగన్ సొంత డబ్బా వాయించుకోవడం శోచనీయం అని తులసిరెడ్డి అన్నారు. వ్యవసాయం గిట్టుబాటు కాక రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో రైతులు పంట విరామం ప్రకటిస్తున్నారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా, పోలవరం, విభజన చట్టంలోని వివిధ అంశాల అమలు గురించి నీతిఆయోగ్ సమావేశంలో ముఖ్యమంత్రి జగన్ ప్రస్తావించకపోవడం రాష్ట్ర ప్రజలను నిరాశ పరిచినట్లు తెలిపారు.